బుధవారం
28-08-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 68
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

జపాన్‌కు టైఫూన్ ముప్పు

టోక్యో: జపాన్‌ను టైఫూన్ షాన్‌షాన్ వణికిస్తోంది. దేశంలోని అనేక ప్రాంతాలు ఈదురు గాలులతో అతలాకుతలమవుతున్నాయి. భారీ వర్షాల కారణంగా దేశప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. షాన్‌షాన్ ప్రభావంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విమాన సర్వీసులు, బుల్లెట్ రైళ్లను రద్దు చేసినట్లు స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ప్రస్తుతం టైఫూన్ షాన్‌షాన్ దక్షిణ అమామి వైపుగా కదులుతున్నట్లు తెలుస్తోంది. గంటకు 216 కిలోమీటర్ల వేగంతో వెళుతున్నట్లు వాతావరణశాఖ పేర్కొంది. భారీ వర్షాల కారణంగా హమామత్సు, తోయోహాషి మధ్య బుల్లెట్ రైళ్ల సర్వీసులు రద్దు చేయాల్సి వచ్చింది.

రాజ్యసభ సభ్యుడిగా సింఘ్వీ ఏకగ్రీవం

విశాలాంధ్ర–హైదరాబాద్: తెలంగాణలో రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ ఉపసంహరణ గడువు ముగిసింది. రాజ్యసభ అభ్యర్థిత్వానికి కాంగ్రెస్ నుంచి అభిషేక్ మను సింఘ్వీ, ఇండిపెండెంట్‌గా పద్మరాజన్ నామినేషన్ దాఖలు చేశారు. అయితే పద్మరాజన్‌ను ఎమ్మెల్యేలు బలపరచకపోవడంతో ఆయన నామినేషన్ తిరస్కరణకు గురైంది. దీంతో రాజ్యసభ సభ్యుడిగా సింఘ్వీ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఆయన తరపున పార్టీ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఎన్నికల అధికారి నుంచి ధృవీకరణపత్రం తీసుకోనున్నారు.

జగన్ విదేశీ పర్యటనకు సీబీఐ కోర్టు అనుమతి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బ్రిటన్ పర్యటనకు సీబీఐ కోర్టు అనుమతించింది. సెప్టెంబరు 3 నుంచి 25 వరకు వైఎస్ జగన్ విదేశీ పర్యటన చేయనున్నారు. పర్యటన వివరాలతో పాటు ఫోన్ నంబర్, మెయిల్ డీటెయిల్స్ కోర్టుకు, సీబీఐకి సమర్పించాలని కోర్టు ఆదేశించింది. ఐదేళ్ల కాల పరిమితితో జగన్‌కు కొత్త పాస్‌పోర్టును సీబీఐ అనుమతించింది. ఇటీవల తన విదేశీ పర్యటనకు అనుమతించాలని కోరుతూ, కోర్టును జగన్ ఆశ్రయించిన విషయం విదితమే. ఈ మేరకు కోర్టు అనుమతి ఇవ్వడంతో జగన్ బ్రిటన్‌లో పర్యటించనున్నారు.

ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో అక్రమాలపై ఈడీ కేసు

కోల్‌కతా: ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో ఆర్థిక అక్రమాలు జరిగాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) స్పష్టం చేసింది. ఈ అక్రమాలకు సంబంధించి ఆర్‌జీ కర్ ఆస్పత్రిపై మంగళవారం మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. మాజీ ప్రిన్సిపాల్, మరికొందరి హయాంలో అక్రమాలు జరిగినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. సీబీఐ ఎఫ్ఐఆర్‌ను పరిగణనలోకి తీసుకుని మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ)లోని

- మిగతా 2 లో

ఇదీ లోకం!



విద్యార్థులపై విరిగిన లాఠీ

కోల్‌కతా రణరంగం

- బెంగాల్ సీఎంఓ ముట్టడిని అడ్డుకున్న పోలీసులు
- లాఠీచార్జి... బాష్పవాయువు, జలఫిరంగుల ప్రయోగం
- తీవ్రంగా ప్రతిఘటించిన ఆందోళనకారులు
- మమతా బెనర్జీ రాజీనామాకు డిమాండ్

కోల్‌కతా: ఆర్జీకర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన దుమారం రేపుతోంది. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా చర్చ జరగడంతోపాటు రోజురోజుకూ నిరసనలు, ఆందోళనలు విస్తరిస్తున్నాయి. ఈ క్రమంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలంటూ విద్యార్థులు మంగళవారం వీధుల్లోకి వచ్చారు.

మమత రాజీనామా చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలనే డిమాండ్లతో విద్యార్థి సంఘం 'పశ్చిమబంగా ఛాత్రో సమాజ్' చేపట్టిన నిరసన తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. హౌరాలోని ముఖ్యమంత్రి కార్యాలయ భవన సముదాయం నబన్నాను ముట్టడించడానికి 'నబన్నా అభియాన్' పేరుతో హౌరా నుంచి నిరసన ర్యాలీ ప్రారంభమైంది. ర్యాలీని సాంత్రగచ్చి వద్ద అడ్డుకోవడంతో విద్యార్థులకు, పోలీసులకు మధ్య తలెత్తిన ఘర్షణతో కోల్‌కతా రోడ్లు రణరంగంగా మారాయి. హౌరా బ్రిడ్జి నుంచి ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు జలఫిరంగులు, బాష్పవాయువు ప్రయోగించారు. రాష్ట్ర సచివాలయం నబన్నా వరకూ విద్యార్థులు చేపట్టిన ర్యాలీని రోడ్లపైనే పోలీసులు అడ్డుకున్నారు. అయినాసరే బారికేడ్లను బద్దలు కొట్టేందుకు ఆందోళనకారులు ప్రయత్నించారు. పోలీసులపైకి రాళ్లు రువ్వారు. ఆందోళనలు నిర్వహించేందుకు అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకుంటూ టియర్ గ్యాస్, జల ఫిరంగులు ప్రయోగించారు. ఒక దశలో గాల్లోకి కాల్పులు జరిపారు. ఎంజీ రోడ్, జీటీ రోడ్డులోనూ ఇదే తరహా పరిస్థితి నెలకొంది. 'మమ్మల్ని పోలీసులు ఎందుకు కొట్టారు? మేం చట్టాలను ఉల్లంఘించలేదు. చనిపోయిన డాక్టర్‌కు న్యాయం చేయాలంటూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్నాం. ముఖ్యమంత్రి బాధ్యత వహించి రాజీనామా చేయాలి' అని నిరసనలో పాల్గొన్న ఓ మహిళ డిమాండ్ చేశారు. అయితే నిరసనకారుల రాళ్ల దాడిలో కొంతమంది పోలీసు అధికారులు సైతం స్వల్పంగా గాయపడ్డారు. ర్యాలీ నేపథ్యంలో సీఎం మమత నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.

నలుగురు విద్యార్థుల అరెస్టు

నిరసన జరిగే సమయంలో హింసకు పాల్పడేందుకు కుట్ర పన్నారని ఆరోపిస్తూ నలుగురు విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. ఆ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడించారు. కాగా ఆ విద్యార్థులు అర్ధరాత్రి

- మిగతా 2 లో

మమతకు పాలిగ్రాఫ్ పరీక్ష చేయాల్సిందే

మరోవైపు, విద్యార్థులపై లాఠీచార్జి చేయడాన్ని బీజేపీ ఖండించింది. మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. జూనియర్ డాక్టర్ హత్యాచారం కేసులో ప్రమేయం ఉన్నవారిని మమత రక్షించారని ఆరోపించింది. కేసులో నిజనిజాలు తెలుసుకోవడానికి మమతతోపాటు పోలీస్ కమిషనర్ వినీత్ గోయెల్‌కు సీబీఐ పాలిగ్రాఫ్ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేసింది. పోలీసుల దమనకాండకు నిరసనగా బుధవారం 12 గంటల బంద్‌కు పిలుపునిచ్చింది.

ఎన్‌సీ-కాంగ్రెస్ కూటమికి మద్దతు

- మూడు స్థానాల్లో పోటీకి సీపీఐ నిర్ణయం
- ఫరూక్ అబ్దుల్లాతో అజీజ్ పాషా, అనీ రాజా భేటీ

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్న నేషనల్ కాన్ఫరెన్స్- కాంగ్రెస్ కూటమికి సీపీఐ జమ్మూకశ్మీర్ శాఖ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా, భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) ప్రధాన కార్యదర్శి అనీ రాజా నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లాను ఆయన నివాసంలో కలిశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ... ఇండియా ఐక్యసంఘటన భాగస్వామ్య పార్టీగా కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌సీ-కాంగ్రెస్ కూటమి అభ్యర్థులకు కశ్మీర్ సీపీఐ శాఖ సంపూర్ణ మద్దతునిస్తున్నట్లు ప్రకటించారు. అయితే మూడు స్థానాల్లో సీపీఐ పోటీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి ఏకాభిప్రాయం కోసం ఇండియా ఐక్యసంఘటన పక్షాలతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఫరూక్ అబ్దుల్లా మాట్లాడుతూ... సీపీఎం, సీపీఐ రెండు కళ్లలాంటివని, ముఖ్యంగా కశ్మీర్ విషయంలో అన్ని విషయాల్లో ఎప్పుడూ సూత్రబద్ధ వైఖరి అవలంబిస్తున్నాయని అన్నారు. చర్చల సందర్భంగా కశ్మీరులోశ్రీనని షోపియాన్‌లో పోటీచేసే యోచనను సీపీఐ నేతలు వ్యక్తపర్చగా... జమ్మూ ప్రాంతంలో ఒకటి లేదా రెండు స్థానాల్లో స్నేహపూర్వకంగా

- మిగతా 2 లో

పేదల ప్రాణం కాపాడేందుకు కదిలిన ఎర్ర సైన్యం

- కిడ్నీ బాధిత గ్రామాల్లో రక్షిత తాగునీటి కోసం ఉద్యమం
- సీపీఐ 'ప్రజారోగ్య పరిరక్షణ యాత్ర' ప్రారంభం

విశాలాంధ్ర–విజయవాడ: కృష్ణానది చెంతనే ఉన్నా... గ్రామీణ ప్రజలకు రక్షిత మంచినీరు అందడంలేదు. ఫ్లోరైడ్, సిలికాన్ మూలకాలు కలిగిన కలుషిత నీటిని తాగి కిడ్నీ వ్యాధుల బారినపడుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఏ కొండూరు, గంపలగూడెం మండలాలల పేద ప్రజలు కిడ్నీ వ్యాధులకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ఎన్నో ఏళ్లుగా తమకు రక్షిత మంచినీరు సరఫరా చేయాలని స్థానికులు, వామపక్షాలు అనేక ఉద్యమాలు చేసినా... వందలమంది ప్రాణాలు కోల్పోయినా పాలకులకు చీమకుట్టినట్లు కూడా లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కళ్లు తెరిపించి పేదల ప్రాణాలను కాపాడేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నడుం బిగించింది. తిరువూరు నియోజకవర్గానికి కృష్ణాజలాలు సరఫరా చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుతూ ప్రజారోగ్య పరిరక్షణ పాదయాత్రగా ఎర్రసైన్యం కదం తొక్కింది. ప్రజల ప్రాణాలు పోతున్నా కిడ్నీ బాధితుల గోడు పాలకులకు పట్టడంలేదని, కూత వేటు దూరంలో కృష్ణాజలాలు ఉన్నా సరఫరా చేయలేని దౌర్భాగ్య పరిస్థితి ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆవేదన వ్యక్తం

- మిగతా 2 లో

వసతి గృహాలపై ఇంత నిర్లక్ష్యమా?

- మెస్, కాస్మెటిక్ చార్జీలు పెంచాలి
- వార్డెన్, కుక్, వాచ్‌మెన్ పోస్టులు భర్తీ
- జీవో 77 రద్దు చేయాలి
- జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం
- రాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్‌ఎఫ్ ఆందోళనలు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళనా కార్యక్రమాలు చేపట్టారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాల్లో మెస్, కాస్మెటిక్ ఛార్జీలు పెంచాలని, వార్డెన్, కుక్, వాచ్‌మెన్, ట్యూటర్ పోస్టులను భర్తీ చేయాలని, పరిశుభ్రత పాటించాలని తదితర డిమాండ్లతో కూడిన ప్లకార్డులు చేతబూని విద్యార్థులు కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టారు. ప్రైవేట్ పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77 రద్దు చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. తిరుపతిలో కలెక్టర్ కార్యాలయం ముందు విద్యార్థులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అఖిల భారత విద్యార్థి సమాఖ్య జాతీయ కార్యదర్శి దినేశ్ శ్రీరంగరాజన్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన వసతి, పౌష్టిక ఆహారం కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. అన్న క్యాంటీన్లో పెడుతున్న భోజనం మూడు పూటలకి రూ.90 ఖర్చు అవుతుందని చెపుతున్న ప్రభుత్వం, వసతిగృహ విద్యార్థులకు 53 రూపాయలు ఏ విధంగా సరిపోతాయో ఆలోచించాలన్నారు. మెస్ ఛార్జీలు రూ.2,500కు పెంచాలన్నారు. శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టాలన్నారు. పీజీ విద్యార్థులకు ఫీజు రీయిబర్స్‌మెంట్ వచ్చే విధంగా చూడాలని కోరారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉదయ్ కుమార్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నవీన్, ప్రవీణ్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి వినయ్, నగర నాయకులు మోహన్, ఆనంద్ ,కిషోర్, శివ ,రాజు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ప్రత్యేక సౌకర్యాలు: జాన్సన్‌బాబు

ఏఐఎస్‌ఎఫ్ విశాఖ జిల్లా సమితి అధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలంటూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వినూత్న రీతిలో ట్రంకుపెట్టెలు, కూరగాయలతో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీ జాన్సన్ బాబుబాబు మాట్లాడుతూ పెరిగిన ధరలకనుగుణంగా ప్రభుత్వం ఎప్పటికప్పుడు మెస్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలని కోరారు. వసతిగృహాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళా వసతి గృహాల్లో భద్రతతో పాటు, వారికి ప్రత్యేక సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ఎం.ఎన్. హరేంద్ర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్

- మిగతా 2 లో

వరాలు ఫలించేనా?

- 12వ పీఆర్సీకి ఉద్యోగుల ఎదురుచూపు
- మధ్యంతర భృతి, కరువుభత్యం చెల్లింపుపై ఆశ
- కాలపరిమితితో కమిషన్ అమలుకు డిమాండ్
- ఆర్థిక అంశాలపై 'కూటమి' హామీ ప్రశ్నార్థకం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టో పెద్దఎత్తున సంక్షేమ పథకాలు, అభివృద్ధితోపాటు ఉద్యోగులకు అనేక వరాలు కురిపించింది. దీనిలో భాగంగా 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) ఏర్పాటుపై ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. మధ్యంతర భృతి (ఐఆర్), పెండింగ్‌లో ఉన్న రెండు కరవు భత్యాలు (డీఏల) కూటమి ప్రభుత్వం చెల్లిస్తుందన్న ఆశతో ఉన్నారు. రాబోయే కేబినెట్ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇచ్చిన హామీలపై కదలిక వస్తుందా లేదా అనేదీ స్పష్టం కానుంది. 11వ పీఆర్సీ బకాయిలనూ చెల్లిస్తుందన్న నమ్మంతో ఉద్యోగస్తులున్నారు. గత ప్రభుత్వ హయాంలో 12 జులై, 2023లో 12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్‌గా డాక్టర్ మన్మోహన్‌సింగ్‌ను నియమించింది. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి ఏడాదిలోగా నివేదిక పంపాలని ఆదేశించినా, సరైన సదుపాయాల కల్పన, కార్యాచరణ లేకపోవడంతో కమిషన్ నివేదిక ముందుకెళ్లలేదు. ఈ లోగా సార్వత్రిక ఎన్నికలు రావడం, అనంతరం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టడంతో కమిషన్ చైర్మన్ రాజీనామా చేశారు. ఇది జరిగి దాదాపు మూడు నెలలవుతున్నా ఇంతవరకు పీఆర్సీ కమిషన్ నియమించకపోవడంపై ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రం పదేళ్లకోసారి, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఐదేళ్లకోసారి పీఆర్సీలను ప్రకటిస్తాయి. దీని ప్రకారం రాష్ట్రంలో 12వ పీఆర్సీ అమలు గడువు 2023 జులైతోనే ముగిసిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు కలిపి మొత్తంగా 14లక్షల

- మిగతా 2 లో

కవితకు బెయిల్

తీహార్ జైలు నుంచి విడుదల

విశాలాంధ్ర – హైదరాబాద్: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఆమె బెయిల్ పిటిషన్‌పై విచారించిన జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విశ్వనాథన్ ద్విసభ్య ధర్మాసనం, ఈడీ, సీబీఐ కేసులో ఆమెకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బెయిల్ మంజూరుకు సుప్రీంకోర్టు మూడు ప్రధాన కారణాలు చెప్పింది. సీబీఐ తుది చార్జిషీట్

- మిగతా 2 లో

జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో మాజీ ఉగ్రవాదులు

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ శాసనసభ ఎన్నికల్లో మాజీ ఉగ్రవాదులు పోటీకి దిగారు. నామినేషన్లకు మంగళవారం చివరిరోజు కావడంతో కొంతమంది అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. నిషేధిత సంస్థ 'జమాతే ఇస్లామీ- జమ్మూకశ్మీర్‌కు చెందిన మాజీ సభ్యులు కొంతమంది నామినేషన్ వేసి... ఎన్నికల్లో పోటీకి సిద్ధమయ్యారు. సంస్థ మాజీ అధ్యక్షుడు తలత్ మాజీద్, సర్జన్ బర్కతీ, సయార్ అహ్మద్ రేషీ తదితరులు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీకి దిగారు. జమాతే ఇస్లామీ... జమ్మూ-కశ్మీర్‌లో అతిపెద్ద రాజకీయ, మతపరమైన సంస్థ. దీనికి పాఠశాలలు, ఇతర సామాజిక మౌలిక సదుపాయాలతో కూడిన భారీ నెట్‌వర్క్ ఉంది. 1990ల్లో కశ్మీర్‌లో ఉగ్రవాద సంస్థ అయిన 'హిజ్బుల్ ముజాహిదీన్'కు సైద్ధాంతిక మార్గదర్శిగా దీనికి పేరుంది. ఈ క్రమంలోనే 2019 ఫిబ్రవరి 28న కేంద్రం దీన్ని చట్టవిరుద్ధ సంస్థగా ప్రకటించి నిషేధించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆ నిషేధాన్ని పొడిగించింది. దేశ భద్రత, సమగ్రత, సార్వభౌమాధికారానికి వ్యతిరేకంగా ఈ సంస్థ తన కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు గుర్తించామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అప్పుడు చెప్పారు.

నేడు ఈ-క్యాబినెట్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గ సమావేశం సచివాలయంలోని సీఎం ఛాంబర్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్నది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగే సమావేశంలో కీలక నిర్ణయాలకు ఆమోదం తెలుపనుంది. మంత్రివర్గ సమావేశం (ఈ-క్యాబినెట్) కాగితరహితతో జరగనున్నది. ఇంతకు ముందు సమావేశానికి వచ్చే మంత్రులకు నోట్ అందజేసి నిర్వహించేవారు. దానికి భిన్నంగా జరుగనున్న సమావేశంలో అజెండా మొదలుకుని నోట్స్ వరకు ఈ-ట్యాబ్‌లు మంత్రులకు అందజేయనున్నారు.

విద్యార్థులపై విరిగిన లాఠీ

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో అదృశ్యమయ్యారని బీజేపీ నేత సువేందు అధికారి ఆరోపించారు. విద్యార్థులు మిస్ అయ్యారంటూ కొందరు రాజకీయ నేతలు తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారని బెంగాల్ పోలీసులు ఎక్స్ వేదికగా స్పందించారు. ఎవరూ అదృశ్యం కాలేదన్నది నిజమని తెలిపారు. దీనికి సువేందు బదులిస్తూ... "ఆ విద్యార్థుల కుటుంబాలు హైకోర్టును ఆశ్రయించాయి. మమతా పోలీస్.. కోర్టులో కలుద్దాం" అని పోస్టు పెట్టారు. నిరసన ర్యాలీలు చట్టవిరుద్ధమంటూ జిల్లా యంత్రాగం ప్రకటించినప్పటికీ 'నబన్నా అభియాన్' ర్యాలీతో ముందుకు వెళ్లాలని పశ్చిమబంగా ఛాత్ర సమాజ్ నిర్ణయించింది. రెండు ప్రధాన ర్యాలీలను ప్లాన్ చేసింది. సెంట్రల్ కోల్‌కతాలోని కాలేజ్ స్క్వేర్ నుంచి ఒక ర్యాలీ, హౌరాలోని సాంత్రగచ్చి నుంచి మరో ర్యాలీలి తలపెట్టింది. దీంతో హౌరాలో 2వేల మంది పోలీసు సిబ్బందిని మోహరించారు. నలుగురు ఏడీజీలు, 13 మంది డీఐజీలు, 15 మంది ఎస్పీ ర్యాంక్ అధికారులు పర్యవేక్షణలో ఈ ఏర్పాట్లు చేశారు. నాలుగు వాటర్ కేనన్ ట్రక్కులను కూడా అందుబాటులో ఉంచారు. అలాగే ఈ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు 26 జిల్లాల కలెక్టర్లు బాధ్యతలు అప్పగించింది. హేస్టింగ్స్‌లోని ఫోర్ట్ విలియం గేట్లకు సివిల్ వలంటీర్లు గ్రీజ్ పూసిన దృశ్యాలు మీడియాలో వెలుగులోకివచ్చాయి. నిరసనకారుల్ని అడ్డుకునేందుకు అధికారులు ఈ విధంగా చేశారు. నిరసన నేపథ్యంలో ప్రజాజీవితానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. కాగా నబన్నా(సచివాలయం) ర్యాలీ బీజేపీ-ఆర్ఎస్ఎస్ ప్రేరేపితమని సీపీఎం నాయకురాలు బృందాకారత్ విమర్శించారు. తీవ్ర విమర్శలు చేశారు.

ఎన్‌సీ-కాంగ్రెస్ కూటమికి మద్దతు

(మొదటిపేజీ తరువాయి)

పోటీ చేస్తే తమకు అభ్యంతరం లేదని తెలిపారు. జమ్మూలో సీపీఐ పోటీ చేయాలనుకున్న మూడు స్థానాలు బీజేపీ ఓట్లను మాత్రమే చీలుస్తాయని సీపీఐ ప్రతినిధి బృందం అబ్దుల్లాకు వివరించింది. అయితే ఫరూక్ అబ్దుల్లా జమ్మూలో కేవలం ఒక సీటు మాత్రమే సూచించి నట్లు పేర్కొంది. ఈ ప్రాంతంలో రాజకీయ దృశ్యం మారిన నేపథ్యంలో పదేళ్ల విరామం తర్వాత ఎన్నికలు చాలా కీలకమని సీపీఐ భావిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మతోన్మాద శక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఓటర్లను మతపరంగా విడగొట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయని తెలిపారు. కశ్మీర్ లోయలోని అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని... అదే సమయంలో జమ్మూలోని చెనాని, దోడ్డా, నిర్గోటా అనే మూడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పార్టీ అభ్యర్థులను నిలబెట్టాలని నిర్ణయించినట్లు అజీజ్‌పాషా, అనీ రాజా తెలిపారు. అయితే ఈ స్థానాల్లో ఏకాభిప్రాయం సాధించడానికి ఇండియా ఐక్యసంఘటన భాగస్వామ్య పక్షాలతో చర్చలు సాగిస్తున్నట్లు తెలిపారు.

వసతి గృహాలపై ఇంత నిర్లక్ష్యమా?

(మొదటిపేజీ తరువాయి)

సానుకూలంగా స్పందించి మెనూ సక్రమంగా అమలు చేయని వార్డెన్‌లు, తనిఖీలు చేయని అధికారులపై చర్యలు తీసుకుంటామని, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కార్యదర్శి. యు.నాగరాజు, జిల్లా అధ్యక్షుడు ఎస్. శ్రీను, జిల్లా సమితి సభ్యులు శేఖర్, గ్రేస్ ప్రకాష్, కిరణ్, మధు, యేసయ్య, నూతన్ ప్రసాద్, దివ్య పాల్గొన్నారు. అలాగే, రాష్ట్రంలోనే అనేక ప్రాంతాల్లో నిరసన దీక్షలు కొనసాగాయి.

ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో అక్రమాలపై ఈడీ కేసు

(మొదటిపేజీ తరువాయి)

వివిధ సెక్షన్ల కింద, ఎఫ్ఐఆర్‌కి సమానమైన ఎన్‌ఫోర్స్ మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) నమోదు చేసింది. ఆర్‌జీ కర్ ఆస్పత్రి, మెడికల్ కాలేజీకి సంబంధించిన బ్యాంకింగ్, మెడికల్ పత్రాలను వేర్వేరు మూలాల నుండి సేకరించిందని, వారి వాంగ్మూలాలు రికార్డు చేసేందుకు త్వరలో నిందితులకు సమన్లు జారీ చేయనున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. సీబీఐ ఫిర్యాదులో పేర్కొన్న పేర్లనే ఈ కేసులోనూ నమోదు చేసినట్లు ఈడీ వెల్లడించింది.

విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితులు

ఆస్ట్రేలియా ప్రభుత్వం యోచన

మెల్‌బోర్న్: వలసలను నియంత్రించే దిశగా ఆస్ట్రేలియా చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితులు విధించనుంది. 2025 ఏడాదికిగానూ ఆ సంఖ్యను 2,70,000కు పరిమితం చేయనుంది. అయితే దీనిపై విశ్వవిద్యాలయాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నిర్ణయం విద్యావ్యవస్థపై ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నాయి. విశ్వవిద్యాలయాల్లో 1,45,000, స్కిల్ ట్రైనింగ్ సెక్టార్‌లో 95,000 మంది విదేశీ విద్యార్థులను అనుమతించేలా ప్రభుత్వం పరిమితులు విధించనుందని ఆస్ట్రేలియా విద్యాశాఖమంత్రి జాసన్ క్లేర్ తాజాగా వెల్లడించారు. అయితే 2023 ఆర్థిక సంవత్సరంలో ఆరు లక్షల విద్యార్థి వీసాలు మంజూరు అయ్యాయి. అంతక్రితం సంవత్సరాలతో పోల్చుకుంటే ఆ సంఖ్య చాలా ఎక్కువ. ఈ నిర్ణయంతో 2025 సంవత్సరానికిగానూ విశ్వవిద్యాలయాల్లో 15 శాతం ఎక్కువగా, ఒకేషనల్ కాలేజీల్లో 20శాతం తక్కువగా విద్యార్థులను అనుమతించనున్నట్లు క్లేర్ వెల్లడించారు. దీనిపై విశ్వవిద్యాలయాలకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఈ నిర్ణయం అంతర్జాతీయ విద్యను దెబ్బతీస్తుందనే వాదన తప్పని అన్నారు. ఈ చర్యపై యూనివర్సిటీస్ ఆస్ట్రేలియా చైర్మన్ డేవిడ్ లాయిడ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది తృతీయ విద్యారంగంపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. ఏదో ఒక రంగం మూల్యం చెల్లించుకునేలా వలస నియంత్రణలు ఉండకూడదని వ్యాఖ్యానించారు. ఇది ఆస్ట్రేలియా పరిశోధన సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దేశంలో ఐదేళ్లకాలంలో వలసలకు మద్దతు తగ్గుతూ వస్తోంది. ఇదిలా ఉంటే.. 2023 సంవత్సరంలో ఆస్ట్రేలియా ఆర్థిక వ్యవస్థలో విదేశీ విద్యార్థుల వాటా 48 బిలియన్ల డాలర్లుగా ఉంది. ఆస్ట్రేలియాకు వచ్చే అంతర్జాతీయ విద్యార్థులు, తక్కువ నైపుణ్యం కలిగిన వ్యక్తుల వీసా నిబంధనలు కఠినతరం చేయనున్నట్లు ఆస్ట్రేలియా గతంలో వెల్లడించింది. తద్వారా వచ్చే రెండేళ్లలో వీరి వలసలను సగానికి తగ్గించవచ్చని అంచనా వేసింది. గతంలో ఈ దేశ ప్రధాని మాట్లాడుతూ దేశంలో వలసలు ఆందోళనకర స్థాయికి చేరుకున్నాయని, దీన్ని సంస్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కొవిడ్ సమయంలో ఏర్పడిన కార్మికుల కొరతను భర్తీ చేసేందుకు ఆస్ట్రేలియా ప్రభుత్వం భారీ స్థాయిలో వలసలను ప్రోత్సహించింది. దాంతో విదేశీ విద్యార్థులు, నిపుణులు ఆస్ట్రేలియా వైపు దృష్టి సారించారు. అప్పటికే గృహ సంక్షోభం ఎదుర్కొంటున్న ఆస్ట్రేలియాపై ఈ పరిణామం మరింత ఒత్తిడి పెంచింది. ఇలా గృహ సంక్షోభం వేళ భారీస్థాయిలో వలసలు రావడం స్థానికంగా మౌలిక సదుపాయాల కల్పనకు మరింత ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలోనే విద్యార్థి, నిపుణుల వలసలను సగానికి తగ్గించి... కేవలం అత్యంత నైపుణ్యం కలిగిన వారికే శాశ్వత నివాసం కల్పిస్తూ దేశంలోకి అనుమతించేందుకు ఆస్ట్రేలియా ప్రయత్నాలు చేస్తోంది.

మోదీ ఉక్రెయిన్ పర్యటన గొప్ప సందేశం: బైడెన్

వాషింగ్టన్: భారత ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రశంసలు కురిపించారు. మోదీ ఉక్రెయిన్‌లో పర్యటించడాన్ని కొనియాడారు. ఈ పర్యటన ద్వారా మోదీ శాంతి సందేశం పంపారని, కొనసాగుతున్న మానవతా సాయానికి మద్దతుగా నిలిచారని వ్యాఖ్యానించారు. 'పోలండ్, ఉక్రెయిన్‌లో మోదీ ఇటీవలి పర్యటన గురించి చర్చించడానికి ఆయనతో ఫోన్‌లో మాట్లాడాను. ఆయన శాంతి సందేశం, మానవతావాద మద్దతు మెచ్చుకోదగ్గవి. ఇండో-పసిఫిక్‌లో శాంతి, శ్రేయస్సు కోసం కలిసి పనిచేయడానికి మేం మా నిబద్ధతను పునరుద్ఘాటించాం' అని బైడెన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపైనా ఇద్దరు నేతలు చర్చించుకున్నారు. ఆ దేశంలో హిందువులు సహా మైనారిటీలందరికీ భద్రత లభించేలా చూడాల్సి ఉందని వారు పేర్కొన్నారు. ప్రాంతీయ, ప్రపంచవ్యాప్త పరిణామాలెన్నో తమ మధ్య సమగ్రంగా చర్చకు వచ్చాయని, పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నామని మోదీ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. గత నెల మోదీ చేపట్టిన రష్యా పర్యటనపై అమెరికా సహా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఈ తరుణంలో మోదీ ఆగస్టు 23న ఉక్రెయిన్‌లో పర్యటించారు. విమర్శలను సమర్థంగా ఎదుర్కోవడానికే మోదీ ఈ పర్యటన చేపట్టారనే విశ్లేషణలు వెలువడ్డాయి. యుద్ధాన్ని ముగించడానికి రష్యాతో చర్చలు జరిపి ఓ పరిష్కారానికి రావాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి మోదీ సూచించారు. ఈ విషయంలో భారత్ క్రియాశీలక పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు.

అర్చకులకు రూ.15 వేల వేతనం

- దూపదీప నైవేద్యాల ఖర్చు రూ.10 వేలకు పెంపు
- దేవదాయ సమీక్షలో సీఎం చంద్రబాబు వరాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలోని దేవాలయాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరవాలని, అపచారాలకు చోటు ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. భక్తులు ప్రశాంతత కోసం, తమ బాధలు దేవుడితో చెప్పుకోవడం కోసం గుళ్లకు వస్తారని, అలాంటి వారికి మంచి దర్శనం, చక్కటి వాతారణం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దేవాలయాల్లో పరిశుభ్రత, ప్రసాదంలో నాణ్యత, ప్రశాంత వాతావరణం కనిపించేలా చర్యలు తీసుకోవాలని, ఏ కుటుంబమైనా పుణ్యక్షేత్రానికి వస్తే ఒకటి, రెండు రోజులు అక్కడ ఉండే వాతావరణం కల్పించాలని ఆదేశించారు. దేవాదాయశాఖపై సీఎం మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇకపై ఎక్కడా బలవంతపు మత మార్పిడులు ఉండకూడదని స్పష్టం చేశారు. అదేవిధంగా దేవాలయాల్లో అన్యమతస్థులు ఉండకూడదని చెప్పారు. ఏ మతంలో అయినా భక్తుల మనోభావాలు ముఖ్యమన్నారు. మతపరమైన పర్యాటక అభివృద్ధి కోసం దేవాదాయ శాఖ, అటవీ శాఖ, పర్యాటక శాఖల మంత్రులతో కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. దేవాలయాల ట్రస్ట్ బోర్డుల్లో అదనంగా మరో ఇద్దరికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. రూ. 20 కోట్లు కంటే ఎక్కువ ఆదాయం ఉంటే 15 మంది బోర్డు సభ్యులుగా ఉంటారు. దీన్ని 17కు పెంచనున్నారు. ఇలా అన్ని ట్రస్ట్ బోర్డులలో ఇద్దరు చొప్పున అదనంగా సభ్యుల సంఖ్యను పెంచనున్నారు. ట్రస్ట్ బోర్డులో ఒక బ్రాహ్మణుడు, ఒక నాయీ బ్రాహ్మణుడు తప్పకుండా ఉండేలా చూస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఆ మేరకు సభ్యుల సంఖ్యను పెంచి వారికి అవకాశం కల్పించనున్నారు. అదేవిధంగా రూ.10 వేలు వేతనం పొందే అర్చకులకు ఇకపై రూ.15 వేలు ఇవ్వనున్నారు. ఈ నిర్ణయం ద్వారా 1683 మంది లబ్ధి పొందనున్నారు. దీనివల్ల ప్రభుత్వంపై ఏటా రూ.10 కోట్ల భారం పడుతుంది. అదేవిధంగా దూపదీప నైవేద్యాలకు దేవాలయాలకు ఇచ్చే మొత్తం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల ఏడాదికి రూ.32 కోట్ల అదనపు భారం పడుతుంది. వేద విద్య చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న వారికి నెలకు రూ.3 వేలు భృతి ఇవ్వాలని సీఎం సూచించారు. నాయీ బ్రాహ్మణులకు కనీస వేతనం రూ.25 వేలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ చేసుకున్న రోజును దేవాదాయ శాఖాపరంగా గుర్తించి ఇకపై అధికారికంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. గోదావరీ, కృష్ణానదీ హారతులు మళ్లీ నిర్వహించాలని, ప్రతి దేవాలయంలో ఆన్‌లైన్ విధానం అమలు చేయాలని, అన్ని సర్వీసులు ఆన్‌లైన్ ద్వారా అందాలని సీఎం ఆదేశించారు. దేవాలయాలకు విరాళాలు ఇచ్చిన వారిని ప్రోత్సహించాలని, రానున్న రోజుల్లో దేవాలయాల్లో స్పష్టమైన మార్పు కనిపించాలని సీఎం అధికారులకు సూచించారు. సమీక్షలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, దేవాదాయశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈడీ, సీబీఐ తీరుపై 'సుప్రీం' అసహనం

న్యూఢిల్లీ: దిల్లీ మద్యం కుంభకోణం కేసులో నిందితురాలిగా ఉన్న ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు చేసిన సుప్రీం కోర్టు... కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐపై తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థల నిష్పక్షపాత వైఖరిపై అనుమానాలు వెలిబుచ్చింది. ఎవరినైనా ఎంపిక చేసుకొని నిందితులుగా పేర్కొంటారా అని ప్రశ్నించింది. ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈడీ, సీబీఐ తీరును ఎండగట్టిన ధర్మాసనం... కేవలం అప్రూవర్లుగా మారిన మాజీ నిందితుల వాంగ్మూలాలపైనే ఆధారపడలేరని పేర్కొంది. 'మీరు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి సాక్షిగా మారారా? ఎంపిక చేసుకొన్నంత మాత్రాన వారిని నిందితులుగా చూస్తారా. ఇందులో న్యాయమెక్కడ' అని ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. అదేసమయంలో మద్యం కుంభకోణంలో కవిత పాత్ర ఉందని చెప్పేందుకు మీ దగ్గర ఉన్న ఆధారాలేమిటని ఈడీ, సీబీఐని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. దర్యాప్తు సంస్థల తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు బదులిస్తూ సాక్షులుగా మారిన బుచ్చిబాబు, మాగుంట రాఘవరెడ్డి ఇచ్చిన ఆధారాలను ప్రస్తావించారు. కవిత తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ జోక్యం చేసుకుంటూ... ఈ వ్యక్తులు ఇచ్చిన వాంగ్మూలాల్లోనే అనేక అంశాలను ఇతర (కేజ్రీవాల్) కేసుల్లో ఆధారాలుగా చూపించారని గుర్తుచేశారు. 'కేజ్రీవాల్ సూత్రధారి, మనీశ్ సిసోడియా సూత్రధారి... ఇప్పుడు కవిత సూత్రధారి అని చెబుతున్నారు. అప్రూవర్లుగా మారిన వాళ్లు ఇచ్చిన వాంగ్మూలం మినహా ఎటువంటి ఆధారాలు లేవు' అని అన్నారు. ఈ క్రమంలో జోక్యం చేసుకున్న సుప్రీం ధర్మాసనం... అప్రూవర్ల వాంగ్మూలాలను వేరుగా చూడాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఈ నేరంలో పాత్ర ఉందని నిరూపించడానికి ఆధారాలు ఏవని ప్రశ్నించింది. అంతేకాకుండా మొబైల్ ఫోన్‌లను ఫార్మాట్ చేసి అందులోని మెసేజ్‌లను కవిత తొలగించారని పిటిషనర్ చేసిన వాదనను న్యాయస్థానం తోసిపుచ్చింది. 'ఫోన్లు అనేవి వ్యక్తిగత అంశానికి సంబంధించినవి. ఫోన్లలో మెసేజ్‌లు అందరూ డిలీట్ చేస్తుంటారు. స్కూళ్లు, కాలేజీ గ్రూపులలో వచ్చే మెసేజ్‌లను నేనూ డిలీట్ చేస్తుంటా. సాధారణంగా అందరూ చేసే ప్రక్రియే. ఇక్కడున్నవాళ్లు ఇదే చేస్తుంటారు. కేవలం ఫోన్ ఫార్మాట్ చేసినంత మాత్రాన నేరం చేసినట్లు భావించకూడదు. నేర నిరూపణకు అదనపు సమాచారం ఉండాలి. లేదంటే కేవలం ఇది ఫోన్‌ను ఫార్మాట్ చేయడం కిందికే వస్తుంది' అని జస్టిస్ విశ్వనాథన్ వ్యాఖ్యానించారు.

కవితకు బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

దాఖలు చేసిందని, ఈడీ దర్యాప్తు పూర్తి చేసిందని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. నిందితురాలు జైలులో ఉండాల్సిన అవసరం లేదని, అందుకే కవితకు బెయిల్ మంజూరు చేస్తున్నామని స్పష్టం చేసింది. మహిళగా కూడా పరిగణించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఇదే సమయంలో బెయిల్‌తో పాటు కొన్ని షరతులు విధించిన ధర్మాసనం, ఒక్కో కేసులో రూ.10 లక్షల పూచీకత్తు సమర్పించాలని, సాక్షులను ప్రభావితం చేయరాదని ఆదేశించింది. పాస్‌పోర్టును కింది కోర్టులో డిపాజిట్ చేయాలని ఆదేశించింది. అంతకుముందు కవిత తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గి సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. ఈడీ కేసులో కవిత 5 నెలలుగా, సీబీఐ కేసులో 4 నెలలుగా జైలులో ఉన్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కేసులో 493 మంది సాక్షులను విచారించారని, ఒక మహిళగా కవిత బెయిల్‌కు అర్హురాలని తెలిపారు. కవిత మాజీ ఎంపీ అని, ఆమె ఎక్కడికీ వెళ్లరని చెప్పారు. రూ.100 కోట్ల ముడుపుల ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్న ముకుల్ రోహత్గి... దర్యాప్తు సంస్థలు కవిత నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సొమ్ము రికవరీ చేయలేదన్నారు. ఇదే కేసులో మనీశ్ సిసోడియాకు బెయిల్ మంజూరైందని, ఆయనకు వర్తించిన నిబంధనలే కవితకూ వర్తిస్తాయని ధర్మాసనానికి వివరించారు. అనంతరం ఈడీ తరఫున వాదనలు వినిపించిన ఏఎస్‌జీ... ఎమ్మెల్సీ కవిత తరచూ ఫోన్లు మార్చారని, ఉద్దేశపూర్వకంగానే ఫోన్లలోని డేటాను పూర్తిగా తొలగించారని కోర్టుకు తెలిపారు. ఫార్మాట్ చేసిన ఫోన్లను ఇంట్లో పని మనుషులకు ఇచ్చారని పేర్కొన్నారు. ఫోన్‌లోని సందేశాలను తొలగిస్తే తప్పేంటని సుప్రీంకోర్టు న్యాయమూర్తి ప్రశ్నించగా... మెసేజ్‌లను కాదు, పూర్తిగా డేటాను ఫార్మాట్ చేశారని, సెల్‌ఫోన్ డేటాను పూర్తిగా ఫార్మాట్ చేయడం అసాధారణమని వివరించారు. ఇరువైపుల సుదీర్ఘంగా సాగిన వాదనల అనంతరం సుప్రీంకోర్టు ధర్మాసనం, కవితకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో ఈడీ అధికారులు కవితను మార్చి 15న అరెస్టు చేయగా, అప్పటి నుంచి దాదాపు 5 నెలలకు పైగా ఆమె తీహార్ జైలులోనే ఉన్నారు.

కేసీఆర్, కేటీఆర్ హర్షం

దిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి ఈడీ, సీబీఐ కేసుల్లో కవితకు బెయిల్ రావడం పట్ల బీఆర్ఎస్ వర్గాల్లో, ఆమె కుటుంబసభ్యుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. తనయుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీశ్ రావులతో కేసీఆర్ ఫోన్‌లో మాట్లాడారు. కుమార్తె బాగోగులు తెలుసుకున్నారు. ఆమె రాక కోసం ఎర్రవెల్లి ఫామ్ హౌస్ సిద్ధమవుతోంది. కవిత సోదరుడు, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "థాంక్యూ సుప్రీంకోర్టు. ఊరట లభించింది.. న్యాయం గెలిచింది" అని కేటీఆర్ పేర్కొన్నారు. కవిత భర్త అనిల్ తండ్రి రామకృష్ణారావు కూడా ఆనందం వ్యక్తం చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ... 'కవిత సుమారు 6 నెలలు జైలు జీవితం అనుభవించింది. ఫోన్ లో మాట్లాడినప్పుడు కూడా ఆమె ఎంతో ధైర్యంగా ఉంది. మాకే ధైర్యం చెప్పింది. ఆలస్యమైనా న్యాయమే గెలిచింది. కవిత కడిగిన ముత్యంలా బయటికి వస్తుందన్న నమ్మకం మాకుంది. కవిత ఇటీవల జ్వరంతో బాధపడింది. 10 కిలోల బరువు తగ్గినప్పటికీ, ఆత్మస్థైర్యం మాత్రం కోల్పోలేదు. కవిత ఏ తప్పు చేయలేదని మేం నమ్ముతున్నాం. ఆమె పది మందికి సాయం చేయాలన్న మనస్తత్వం ఉన్న వ్యక్తి. తెలంగాణ ఆడపడుచులు, అన్నదమ్ముల ఆశీస్సులు ఆమెకు ఉన్నాయి' అన్నారు.

కదిలిన ఎర్ర సైన్యం

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అధ్వర్యంలో పాడెక్కుతున్న ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని చేపట్టిన 'ప్రజా ఆరోగ్య పరిరక్షణ పాదయాత్ర'ను ఎ.కొండూరు దయాలసిస్ సెంటర్ వద్ద రామకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఏ.కొండూరు నుంచి విజయవాడ వరకు దాదాపు వంద కిలో మీటర్లు 'ప్రజారోగ్య పరిరక్షణ పాదయాత్ర' సాగనుంది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ... రాయలసీమ వంటి ప్రాంతాల్లో నీళ్లు లేవంటే అర్థముందికానీ కృష్ణానది చెంతనే ఉన్నా జిల్లాలోని గ్రామాలకు నీటి కష్టాలు ఉన్నాయంటే పాలకులు సిగ్గుపడాలన్నారు. కిడ్నీ బాధితుల సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళతామన్నారు. కిడ్నీ బాధితులకు నెలకు రూ.10వేలు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం బాధితులతో పాదయాత్రలో పాల్గొని బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న యువకుడు బర్మావతు కృష్ణారావు(33)కు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కృష్ణాజలాల సరఫరా నిమిత్తం పైపులైన్ నిర్మాణం కోసం తీసుకువచ్చిన పైపులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆగిపోయిన పైపులైన్ పనులు, రిజర్వాయర్ల నిర్మాణం పనుల వివరాలను స్థానికులు రామకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ రూ.50 కోట్లతో కృష్ణాజలాలను పైపులైన్ ద్వారా సరఫరా చేస్తామని చెప్పిన ప్రభుత్వం... ఆచరణలో ఒక్క అడుగు కూడా ముందుకేయలేదన్నారు. కృష్ణాజలాల తరలింపు ప్రాజెక్టుకు కేంద్ర 'జలజీవన్ మిషన్' ఆమోదం తెలిపినా రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించక పోవటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లటానికి అవసరమైతే కిడ్నీ బాధితులను అసెంబ్లీకి కూడా తీసుకెళతామని చెప్పారు. కాగా ప్రజారోగ్య పరిరక్షణ పాదయాత్రకు తిరువూరు నియోజక వర్గ శాసన సభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు మేలు చేసే అంశాలను ఏ పార్టీ సూచించినా స్వీకరిస్తామని చెప్పారు. మాజీ శాసన సభ్యులు నల్లగట్ల స్వామిదాసు ప్రజారోగ్య పరిరక్షణ పాదయాత్రకు మద్దతు ప్రకటించారు. కిడ్నీ బాధితుల పక్షాన పోరాటం చేస్తానని చెప్పిన పవన్ కల్యాణ్ నేడు ఉపముఖ్యమంత్రిగా, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా ఉన్నారని... వెంటనే కిడ్నీ బాధితుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు పి.ఆనందరావు పాదయాత్రకు సంఘీభావం ప్రకటించారు. పాదయాత్ర చీమలపాడు గ్రామంలో మధ్యాహ్న భోజన విరామం అనంతరం అమరవీరుల స్థూపం నుంచి తిరిగి ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, తూము కృష్ణయ్య, వల్లంకొండ బ్రహ్మం, సీపీఐ విజయవాడ నగర సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య, నాయకులు శర్మ అభ్యుదయ గీతాలు ఆలపించారు.

వరాలు ఫలించేనా?

(మొదటిపేజీ తరువాయి)

మంది ఉన్నారు. వారిలో పూర్తి స్థాయి ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు పీఆర్సీ అమలు చేయాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో 11వ పీఆర్సీపై అశుతోశ్ కమిటీ ఇచ్చిన నివేదిక, దాని విధివిధానాలతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారు. అనేక దఫాలుగా ప్రభుత్వంతో ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు చర్చించినప్పటికీ వాటి అమలుకు నోచుకోలేదు.

11వ పీఆర్సీతో ఉద్యోగుల ప్రయోజనాలకు భారీగా నష్టం వాటిల్లింది. కరోనాతో ఆర్థిక పరిస్థితులు బాగాలేదన్న సాకుతో వారి ఆర్థిక పరమైన ప్రయోజనాలపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం చూపింది. హెచ్‌ఓడీ, జిల్లా, మున్సిపల్, మండల, పంచాయతీల పరిధిలో వివిధ కేటగిరీల ఉద్యోగుల హెచ్‌ఆర్‌కు కోత విధించారు. పీఆర్సీ అడిగితే హెచ్‌ఆర్‌లో కోత విధించడాన్ని ఉద్యోగులు తప్పుపడుతున్నారు. ఐదేళ్ల కాలంలో ప్రతి ఉద్యోగి ఆయా కేటగిరీల వేతనాలకు అనుగుణంగా లక్ష నుంచి ఐదు లక్షల వరకు నష్టపోయారు. పీఆర్సీతోపాటు అన్ని ప్రయోజనాలు కలిసి దాదాపు రూ.30వేల కోట్లు ఉద్యోగులకు రావాల్సిఉంది. 2024 జనవరి, జులై డీఏలు చెల్లించాలి. కంటితుడుపు చర్యలతో ఎన్నికల్లో గత ప్రభుత్వానికి ఉద్యోగులు తగిన గుణపాఠం చెప్పారు. ఇప్పుడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా గుర్తుచేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చేందుకు ఉద్యోగస్తులు ఏకపక్షంగా మద్దతిచ్చారు. ఆర్థిక పరమైన అంశాలపై దృష్టిపెట్టడం లేదు. కేవలం బదిలీలపై నిషేధం తొలగింపు, రాష్ట్ర సచివాలయ ఉద్యోగులకు వారానికి ఐదు రోజుల పని దినాల కొనసాగింపునే ప్రభుత్వం అమలు చేస్తోంది. ఒకటో తేదీన వేతనాలు మంజూరు చేస్తున్నప్పటికీ, పెన్షనర్లకు వారం రోజుల తర్వాత పడుతున్నాయి. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనాలు పడటం లేదు. ముందు పూర్తిస్థాయి ఉద్యోగులకు వేతనాలు వేసి, ఆ తర్వాత కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వారికి వేయడంపై వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగస్తుల ఆర్థికపరమైన అంశాల అమలుకు చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన హామీల అంశం ప్రశ్నార్థకంగా మారింది. ప్రధానంగా మేనిఫెస్టోలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులకు ఐఆర్ ప్రకటిస్తామని, 12వ పీఆర్సీ అమలు చేస్తామని వెల్లడించింది. పదవీ విరమణ ఉద్యోగులకు పాత స్లాబ్‌ల ప్రకారం పెన్షన్ చెల్లిస్తామని, ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని కూటమి మేనిఫెస్టోలో పొందుపరిచారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగస్తులకు ప్రభుత్వ పథకాలను వర్తింపజేస్తామని, సీపీఎస్/జీపీఎస్ విధానాన్ని పునఃసమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారానికి కృషి చేస్తామని హామీలు ఇచ్చారు. వీటన్నిటిని కూటమి ప్రభుత్వం పక్కనపెట్టి...కేవలం ఒకటి, రెండు అంశాలపైనే ప్రధాన దృష్టి పెట్టడంపై ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే ఆలస్యమైన 12వ పీఆర్సీ కమిషన్‌నే ప్రకటించకపోతే, ఇంకెప్పుడు పీఆర్సీని అమలు చేస్తారంటూ ఇటీవల ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. కేబినెట్ సమావేశంలో సీఎం చంద్రబాబు స్పందించి 12వ పీఆర్సీ కమిషన్‌కు ఒక కాల పరిమితి విధించి నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. రెండేళ్లుగా 20వేల మంది పదవీ విరమణ చేశారు. వచ్చే మార్చిలో 15వేల మంది పదవీ విరమణ చేయనున్నారు. ఈ ఖాళీల భర్తీపైనా ప్రభుత్వం దృష్టి పెట్టాలి. ప్రభుత్వం మాత్రం ఆర్థిక పరిస్థితులను సాకు చూపకుండా, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుకు కృషి చేయాలని, తక్షణమే పీఆర్సీ కమిషన్ వేయాలని, మధ్యంతర భృతి ప్రకటించాలని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

హామీలపై ప్రభుత్వ వైఖరి ఏమిటి?

ఎస్టీయూ ప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం తన వైఖరిని తెలపాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం- ఆంధ్రప్రదేశ్ (ఎస్టీయూ- ఏపీ) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ప్రతిపాదించిన జీపీఎస్ కంటే...మెరుగైన పెన్షన్ విధానాన్ని తెస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఏకీకృత పెన్షన్ స్కీమ్(యూపీఎస్) ఆమోదయోగ్యం కాదని, ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానం తప్ప మరే పెన్షన్ విధానాన్ని అంగీకరించబోమన్నారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశంలో పాత పెన్షన్ విధానం తప్ప, మరే ప్రత్యామ్నాయాన్ని అంగీకరించబోమని తీర్మానించినట్లు తెలిపారు. సీపీఎస్ రద్దుపై ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలని, లేకపోతే సెప్టెంబరు ఒకటి... సీపీఎస్ అమలు రోజున అన్ని జిల్లా కేంద్రాలలో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. రూ.21 వేల కోట్లకుపైగా ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలపై ప్రభుత్వం ఏర్పడి 75 రోజులైనా ఎలాంటి ప్రకటనగాని, చర్చలు గాని లేవన్నారు. విద్యారంగంలో తీసుకువచ్చిన సంస్కరణల ప్రభావంతో ప్రాథమిక విద్యారంగం అంతరించిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. కొత్తగా 200లకుపైగా ప్లస్ టు పాఠశాలలు ఏర్పాటు చేసినప్పటికీ ఉపాధ్యాయులను నియమించలేదని వివరించారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు కనీస వేతన స్కేలు అమలు చేయలేదన్నారు. 12వ పీఆర్సీ కమిటీ అమలులో ఉందో లేదో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. పని సర్దుబాటుపై మార్గదర్శకాలకు భిన్నంగా చాలా చోట్ల బలవంతంగా ఉపాధ్యాయులను పని సర్దుబాటుపై తరలించారన్నారు. ఎస్జీటీ ఉపాధ్యాయులను మొదట మండల స్థాయిలో సర్దుబాటు చేయాల్సి ఉండగా...ఇంతవరకు స్పష్టత లేదన్నారు.

ప్రజల క్షేమం పట్టని మోదీ

ధరల పెరుగుదలపై పోరు: ముప్పాళ్ల

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: మోదీ ప్రభుత్వానికి ప్రజల క్షేమం పట్టడం లేదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. సీపీఐ గుంటూరు జిల్లా సమితి సభ్యుల సమావేశం గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లోని వీఎస్‌కే హాలులో మంగళవారం జరిగింది. జిల్లా కార్యవర్గ సభ్యులు రామిశెట్టి ఆదేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు 100 రోజులలో తగ్గిస్తామని హామీ ఇచ్చిన మోదీ సర్కారు...అధికారం చేపట్టి పదేళ్లు దాటినా మాట నిలుపుకోలేదని ఆరోపించారు. మోదీ పాలనలో నిత్యావసరాలు నింగినంటితే... పెట్రోల్, డీజిల్ ధరలు అడ్డుఅదుపులేకుండా పెరిగిపోయాయని చెప్పారు. కుల, మత, ప్రాంతీయ భేదాలు సృష్టించి దేశ ప్రజల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు మోదీ సర్కారు కుట్ర పన్నుతోందని దుయ్యబట్టారు. ఏ విధంగానైనా తమ అధికారాన్ని శాశ్వతం చేసుకోవడానికి నానాతంటాలు పడుతోందన్నారు. అధిక ధరలు నియంత్రించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రచారాందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 6వ తేదీన కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు చేస్తామన్నారు. ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని

కోరారు. త్వరలో జరుపుకోనున్న సీపీఐ శత జయంతి ఉత్సవాలను వాడవాడలా ఘనంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని ముప్పాళ్ల పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కొల్లగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని, భూములు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని, ప్రభుత్వ పోరంబోకు, చెరువు పోరంబోకు, అసైన్డ్ భూములలో గత 15, 20, 30 సంవత్సరాలుగా నివాసాలు ఏర్పాటు చేసుకున్న పేదలకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో బుధవారం విజయవాడ దాసరిభవన్‌లో జరిగే భూ బాధితుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు. సదస్సుకు జిల్లా నుంచి భారీగా భూ బాధితులు రావాలని పిలుపునిచ్చారు. విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రభుత్వాలు తీసుకువస్తున్న విధానాల వలన వినియోగదారులు వీధిన పడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన చంద్రబాబు నేడు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ఆయన ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల సత్యనారాయణ, మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్, పచ్చల శివాజీ, షేక్ వలి, బందెల నాసర్ జీ, ముప్పాళ్ల శివశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినులకు మెరుగైన వైద్యం

కాకినాడ కలెక్టర్‌కు డిప్యూటీ సీఎం పవన్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని డా.బి.ఆర్. అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 30 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరా తీశారు. కడుపు నొప్పి, విరేచనాలతో బాధపడుతూ విద్యార్థినులు ఆస్పత్రిలో చేరడంపై వెంటనే స్పందించిన పవన్ కల్యాణ్... కాకినాడ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలందించే ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలని ఆదేశించారు. వీరికి చికిత్స నిమిత్తం ఏలేశ్వరం ఆస్పత్రికి వైద్య నిపుణులను పంపించాలని చెప్పారు. గురుకులంలో విద్యార్థినులకు అందించిన ఆహారం, అక్కడి తాగు నీరు పరీక్షలు చేయించాలని స్పష్టం చేశారు.

ఏలేశ్వరం ఘటనపై మంత్రి డోలా విచారం

గురుకుల పాఠశాల విద్యార్థుల అస్వస్థత ఘటనపై సాంఘిక సంక్షేమ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి విచారం వ్యక్తం చేశారు. ఘటనపై కాకినాడ జిల్లా కలెక్టర్, అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఘటనపై ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులంతా క్షేమంగా ఉన్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి పేర్కొన్నారు.

పెద్దిరెడ్డితో రాజీపడ్డారా?

రామచంద్ర యాదవ్ ప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లు దహనం చేస్తే ఇప్పటికీ విచారణ పేరుతో సాగదీస్తున్నారని, భూముల కబ్జా, అరాచక ఆరోపణలు ఉన్న మాజీమంత్రి పెద్దిరెడ్డిపై ఇప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోలేదని భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ ప్రశ్నించారు. విజయవాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన రాష్ట్ర సర్కారు తీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ కీలక ప్రశ్నలు సంధించారు. భూఅక్రమాలు, అరాచకాలపై పుంగనూరు నియోజకవర్గంలో చిన్న పిల్లాడిని అడిగినా చెప్తారని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పెద్దిరెడ్డిని ఏమి చేయలేకపోతోందన్నారు. పుంగనూరు వస్తే చంద్రబాబుపై రాళ్లు వేయించి... తిరిగి ఆయనపైనే అక్రమ కేసు బనాయించిన పెద్దిరెడ్డిపై టీడీపీ ప్రభుత్వం ప్రేమ చూపిస్తున్నదని, ఈ ప్రభుత్వం పెద్దిరెడ్డితో రహస్య బంధం కొనసాగిస్తోందా అని రామచంద్రయాదవ్ ప్రశ్నించారు. మద్యంలో రూ.40 వేల కోట్ల అవినీతి జరిగిందని చెప్తున్నారని, కానీ ఆ అవినీతిని కక్కిస్తారా లేదా వాళ్లతో లాలూచీ పడతారా అని నిలదీశారు. మద్యం అవినీతిలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరినీ సీఎం చంద్రబాబు కలిసినట్టు ఆరోపణలు వస్తున్నాయన్నారు. సీఎం చంద్రబాబు రహస్యంగా బెంగళూరు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. రాజమండ్రి నుండి నేరుగా హైదరాబాద్ వెళ్లాల్సి ఉండగా, అప్పటికప్పుడు షెడ్యూల్ మార్పులు చేసి బెంగళూరు వెళ్లారని, దీనిలో ఆంతర్యం ఏమిటో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు.

అసత్య ప్రచారాలే వైసీపీ సిద్ధాంతం: బైరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అసత్య ప్రచారాలే వైసీపీ సిద్ధాంతమని టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి విమర్శించారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయన మాట్లాడుతూ... ఎన్నికల ముందు వై నాట్ 175 అంటూ ప్రగల్భాలు పలికి 11 సీట్లకు పరిమితమైన వైసీపీకి ఏం చేయాలో దిక్కుతోచక అసత్య ప్రచారాలకు పరిమితమైందని అన్నారు. తాము అధికారంలోకి వచ్చి రెండు నెలలు కాకముందే పేదవాళ్ల ఆకలి తీర్చాలన్న సదుద్దేశంతో అన్న క్యాంటీన్ల ద్వారా వారి ఆకలి తీరుస్తుంటే వాటిపై కూడా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తిరుమల తిరుపతి దేవస్థానాన్ని తెలంగాణకి అప్పగించామని, సమీక్ష దశలోనే ఉన్న అమ్మకు వందనంపై కూడా విష ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. సాక్షి పత్రికలో... సత్యమేవ జయతే అనే సూక్తిని అసత్యమేవ జయతేగా మార్చుకుంటే బాగుంటుందేమోనని ఎద్దేవా చేశారు. బుధవారం క్యాబినెట్ మీటింగ్ ఉంటుందని ఉత్తర్వులు జారీ చేస్తే... ఆధారాలు లేకుండా క్యాబినెట్ మీటింగ్ కావాలనే వాయిదా వేశారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. నిజమైన వార్తలను పక్కన పెట్టి టీడీపీ కార్యకర్తలు, నాయకులు, లోకేశ్, చంద్రబాబుపై తప్పుడు ప్రచారాలు కొనసాగిస్తే రాబోయే ఎన్నికల్లో పార్టీని మూసేసుకునే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. నంద్యాలలో వైసీపీ కార్యకర్తలు గొడవపడి హత్య జరిగితే అది టీడీపీ వాళ్లే చేయించారంటూ విలేకరుల సమావేశాలు పెడుతున్నారని విమర్శించారు. జగన్ ... రాయలసీమ అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు.

కంగనా పార్లమెంట్ సభ్యత్వం రద్దు

కేవీవీ ప్రసాద్ డిమాండ్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: బీజేపీ ఎంపీ, సినీనటి కంగనా రనౌత్... రైతు ఉద్యమంపై చేసిన అవాస్తవ, అనుచిత వ్యాఖ్యల పట్ల ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఆమె పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని, దేశ ప్రజలకు ముఖ్యంగా రైతులకు ఆమె క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలోని 140 కోట్ల మంది ప్రజలకు అన్నం పెడుతున్న రైతు పట్ల ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని అన్నారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లోని జిల్లా రైతు సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతాంగ ఉద్యమం గురించి మాట్లాడే ముందు దాని చరిత్ర గురించి తెలుసుకోవాలని ఆమెకు హితవు పలికారు. రైతాంగ ఉద్యమాన్ని అణచివేయకపోతే... బంగ్లాదేశ్ పరిస్థితులు ఏర్పడతాయంటూ చెప్పడం... మూడు నల్ల చట్టాల ఉద్యమం వెనుక అనేక రకాల వ్యక్తులు ఉన్నారని... ఉద్యమం అలాగే కొనసాగితే దేశాన్ని విభజన చేసే పద్ధతుల్లో వారు ఉంటారని... మరణహోమాన్ని సృష్టించడానికి రైతులు కారణమవుతున్నారని ఆమె వ్యాఖ్యలు చేయడాన్ని కేవీవీ తప్పుపట్టారు. ఇటువంటి వ్యక్తులను పార్లమెంటులో కూర్చోపెట్టడమంటే దేశానికి తలవంపులు తేవడమేనని అన్నారు. మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం ఢిల్లీలో సాగించిన ఉద్యమ ఫలితంగా దేశ ప్రధాని క్షమాపణలు చెప్పి ఆ మూడు చట్టాలను వెనక్కి తీసుకున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఆనాడు రైతాంగానికి ఇచ్చిన హామీలను మోదీ అమలు చేయని కారణంగా నేడు మరోమారు ఉద్యమానికి రైతాంగం సన్నద్ధం అవుతున్నారని స్పష్టం చేశారు. ఏఐకేఎస్ పిలుపులో భాగంగా రైతాంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 1న రాష్ట్ర వ్యాప్తంగా రైతు సంఘం పతాకాలను ఆవిష్కరించడంతో పాటు గ్రామగ్రామాన ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కంగనా వ్యాఖ్యలను నిరసిస్తూ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో రైతు సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చల శివాజీ, నాయకులు ముప్పాళ్ల శివశంకరరావు, దేవునిదయ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫలితాలపై అనుమానాల నివృత్తి

ఈసీకి వైసీపీ ప్రతినిధుల బృందం వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికల ఫలితాలపై తమకున్న అనుమానాలు రోజురోజుకూ బలపడుతున్నాయని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఈసీపై ఉందని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్‌కు వైసీపీ నేతల ప్రతినిధుల బృందం వినతిపత్రం అందజేసింది. అంబటి మాట్లాడుతూ, పోలింగ్ రోజు గణాంకాలకూ, ఓట్ల లెక్కింపురోజు గణాంకాలకు తేడా ఎందుకు ఉందనీ, దీనిపై ఈసీ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈవీఎంల బ్యాటరీ ఛార్జింగ్ స్టేటస్‌పై అనుమానాలు నివృత్తి చేయాల్సిన బాధ్యత ఈసీపై ఉందని, వాటి పనితీరుపై దేశవ్యాప్తంగా సందేహాలు వెల్లువెత్తుతున్నాయని చెప్పారు. 175 నియోజకవర్గాల నుంచి ఫామ్ 20 డేటా ఈసీ ఇప్పటికీ ఎందుకు తెప్పించడం లేదని, తక్షణమే తమ అనుమానాలపై ఈసీ స్పందించాలన్నారు. ఎన్నికల్లో ప్రజల తీర్పును అంగీకరించకతప్పదని, ప్రజాస్వామ్య పరిరక్షణపై దేశంలో అనేక సంస్థలు ఎన్నికల నిర్వహణపై అనేక అనుమానాలు వ్యక్తం చేశాయని తెలిపారు. పోలింగ్ తర్వాత ఈసీ అనేక గణాంకాలు ప్రకటించిందని, ఆరుగంటల తర్వాత తమకు అందిన సమాచారం ప్రకారం 68.12 శాతం పోలింగ్ నమోదయిందని గుర్తుచేశారు. అదే రోజు రాత్రి 11.45 గంటల ప్రాంతంలో మరో ప్రకటన చేస్తూ 76.5 శాతం పోలింగ్ జరిగినట్లు వివరించారు. చివరిగా 80.66 శాతం ప్రకటించారని, కౌంటింగ్ రోజు చూస్తే 82 శాతం పైచిలుకుగా చెప్పారు. దీనిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. విజయనగరం పార్లమెంట్‌కు సంబంధించి మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, గజపతినగరంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ఇద్దరూ ఈవీఎంల బ్యాటరీలపై అనుమానాలు వ్యక్తం చేయగా, అధికారుల నుంచి స్పష్టత లేదన్నారు. బ్యాటరీలు ఎందుకు చార్జింగ్ పెరిగాయని ప్రశ్నిస్తే సమాధానం లేదని చెప్పారు. మేరుగు నాగార్జున మాట్లాడుతూ, ప్రజాస్వామ్యం అపహాస్యం కాకుండా ఈసీ స్పందించాలని కోరారు. వివేక్ యాదవ్‌ను కలిసిన బృందంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, ఎ.నారాయణమూర్తి ఉన్నారు.

ఉత్పత్తి సామర్థ్యం పెంచాలి: కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్వయం సహాయక సంఘాలను స్వయం ఉత్పత్తి కేంద్రాలుగా మార్చి, వారి ఉత్పత్తి సామర్థ్యం పెంపునకు అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులు ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలోని తన ఛాంబర్‌లో గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ పనితీరును అధికారులతో ఆయన మంగళవారం సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటయిన 100 రోజుల్లో సాధించాల్సిన ప్రగతి, అందులో ఏ మేరకు ఫలితాలు సాధించారనే దానిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖలో ప్రస్తుతం కొనసాగుతున్న పథకాల అమలు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. 90 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులలో 55 లక్షల మంది లక్ష కన్నా అదనపు ఆదాయం కలిగి ఉన్నారని, మిగిలిన 35 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు లక్ష కంటే ఎక్కువ ఆదాయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా ఇప్పుడు 144 రకాల ఉత్పత్తులను 98 గ్రూపులను తయారు చేస్తున్నారని మంత్రి సూచించారు. రాష్ట్ర స్థాయిలో పది స్వయం సహాయక సంఘాలు తయారు చేసే ఉత్పత్తులను చిన్న, మధ్య, తరహా పరిశ్రమల స్థాయికి తీసుకెళ్లాలని, మరో వంద సహాయక సంఘాలు తయారు చేసే ఉత్పత్తులను సూక్ష్మ చిన్న పరిశ్రమల స్థాయిలోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, సెర్ప్ సీఈఓ వీర పాండ్యన్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కేడర్ సర్వీసు అధికారుల పరీక్షలు వాయిదా : ఏపీపీఎస్సీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అఖిల భారత సర్వీసెస్ అధికారులు (ఏఐఎస్), రాష్ట్ర సర్వీసుల్లో పనిచేస్తున్న అధికారులకు నిర్వహించే అర్థ సంవత్సరపు పరీక్షలను వాయిదా వేసినట్లు ఏపీపీఎస్సీ సెక్రటరీ జె.ప్రదీప్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత సెప్టెంబరు 10 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించాలని షెడ్యూలు విధించగా, పరిపాలన కారణాల రీత్యా వాటిని వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు.

రుషికొండ భవనాలపై త్వరలో నిర్ణయం

మంత్రి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వ్యవస్థలూ నిర్వీర్యమయ్యాయని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ విమర్శించారు. విశాఖపట్నంలోని కాపులుప్పాడ డంపింగ్ యార్డును ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి ఆయన మంగళవారం ఉదయం పరిశీలించారు. వీఎంఆర్డీఏ కార్యాలయంలో రోజంతా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం నారాయణ మీడియాతో మాట్లాడారు. రుషికొండ భవనాలపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారని, అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటారన్నారు. ఇతర దేశాల్లో ఘన వ్యర్థాల నిర్వహణలో దుర్వాసన లేదని, అదేవిధానంపై అధ్యయనం చేసి ఇక్కడా అమలు చేస్తామని అన్నారు. గత ఐదేళ్లలో ఒక్క మొక్క కూడా ఈ ప్లాంట్‌కు రాలేదన్నారు. 2023లో రూ.450 కోట్ల నిధులు వస్తే వాటినీ వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించిందని, చంద్రబాబు చొరవ తీసుకుని ఆ డబ్బు మున్సిపల్ శాఖకు ఇచ్చారన్నారు. టీడీఆర్ కుంభకోణాలపై వచ్చే నెల నాటికి స్పష్టత వస్తుందన్నారు. సెప్టెంబర్ 13న మరో 75 అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తామన్నారు. గతంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేశారని, అక్రమ నిర్మాణాలను వదులుకోవాలని పిలుపునిస్తున్నామని, నిర్మాణాలు వదులుకోకపోతే తామే స్వాధీనం చేసుకుంటామన్నారు. కబ్జా భూముల్లో నిర్మించిన భవనాల్లో ఇప్పటికే కొన్నింటిని కులగొట్టామని, అక్రమ నిర్మాణాలు చేపడితే హైడ్రా తరహా చర్యలు మొదలు పెట్టాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్, వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్, విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, పి.గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేశ్ బాబు, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, దువ్వరపు రామారావు, టీడీపీ నేత పీలా శ్రీనివాసరావు, ఆయా శాఖల అధిపతులు, జోనల్ కమిషనర్లు పాల్గొన్నారు.

సుగాలి ప్రీతి కేసు సీఐడీకి

హోంమంత్రిని కలిసిన బాధితురాలి తల్లి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సుగాలి ప్రీతి కేసును సీఐడీకి అప్పగిస్తామని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత హామీ ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం మంత్రిని ప్రీతి తల్లి కలిశారు. న్యాయం కోసం ఏడేళ్లుగా

తిరుగుతున్నా జరగలేదన్నారు. గత ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగిస్తున్నట్టు జీవో ఇచ్చిందన్నారు. సీబీఐ విచారణ ప్రారంభం కాకపోవడంతో ఢిల్లీ వెళ్లగా, ఆ జీవో టిష్యూ పేపర్ తో సమానమని అధికారులు చెప్పారన్నారు. గత ప్రభుత్వం ఫేక్ జీవోలతో తమను మోసం చేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కేసుపై త్వరగా విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరగా, స్పందించిన మంత్రి ... కేసు సీఐడీకి అప్పగిస్తామని హామీ ఇచ్చారు. కాగా, 2017లో కర్నూల్ పట్టణంలో ప్రీతి అనే విద్యార్థిని అత్యాచారానికి గురికాగా, మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తమ కుమార్తెపై పాఠశాల కరస్పాండెంట్ కుమారులు అత్యాచారం చేసి అనంతరం హతమార్చారంటూ తల్లిదండ్రులు ఆరోపించారు. అప్పటి నుంచి న్యాయం కోసం బాధిత కుటుంబం ప్రభుత్వాల చుట్టూ తిరుగుతూనే ఉంది.

చమురు సంస్థల దోపిడీపై సీపీఐ పోరాటం

డేగా ప్రభాకర్

విశాలాంధ్ర-అమలాపురం: కెజి బేసిన్‌లో ఉన్న సహజ వాయువు, చమురు నిక్షేపాలను కొల్లగొడుతూ రాష్ట్రాన్ని గుల్ల చేస్తున్న రిలయన్స్ వంటి సంస్థలపై ప్రభుత్వ అజమాయిషీ లేకుండాపోయిం దని, వీటిపై సీపీఐ రాష్ట్ర స్థాయిలో ఆందోళనలకు కార్యాచరణ రూపొంది స్తోందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ వెల్లడించారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు అధ్యక్షతన జరిగిన జిల్లా సమావేశానికి ముఖ్య అతిథిగా డేగా ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ సీపీఐ రానున్న కాలంలో అనేక ఆందోళనలకు ప్రణాళిక రూపొందించిందన్నారు. రైతు సమస్యలపై సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో విశాఖపట్నంలో ఆందోళనలకు శ్రీకారం చుడతామన్నారు. సెప్టెంబరు 1 నుంచి 5 వరకూ అధిక ధరలపై ప్రచారాందోళన, 6న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామన్నారు. వివిధ జిల్లాల్లో మండలాలు, నియోజకవర్గ శాఖల సమావేశాలు, శిక్షణా తరగతులు నిర్వహిం చాలని నిర్ణయించినట్లు ఆయన వివరించారు. కె.సత్తిబాబు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఆక్వా రంగంలో మహిళలు పనిచేసే విధంగా సీపీఐ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆర్టీసీ నాయకులు డి.వి.రమణ, మోకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతుకు అండగా ఉంటాం: నాదెండ్ల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కూటమి ప్రభుత్వం ప్రతి రైతును ఆదుకునేందుకు అంకిత భావంతో పని చేస్తుందని, రైతు భరోసా అందించే విధంగా ముందుకు వెళ్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. తూనికలు, కొలతల శాఖ అధ్వర్యంలో విజయవాడలోని పౌరసరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయంలో ఎరువులు, పురుగు మందుల తయారీదార్లు, డీలర్లతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. యూరియా, డీఏపీ, ఎరువులు, పురుగు మందుల అమ్మకాల విషయంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. రైతు మోసపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తూకంలో తేడాలు, అధిక ధరలకు విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒక్కోచోట బస్తాకి రెండు, మూడు కేజీలు తేడాలు ఉంటున్నాయన్నారు. ప్రతి బ్యాగు బరువు చూసి అమ్మాలన్నారు. గత ప్రభుత్వంలో రైతులు చాలా ఇబ్బందులుపడ్డారన్నారు. ఎరువులు, విత్తనాల కోసం ఇబ్బందులుపడ్డారన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చట్టాల్లో మార్పులు తీసుకొస్తామన్నారు. కొత్తగా అమల్లోకి వచ్చిన యూనిట్ సేల్ ప్రైస్ నిబంధనను తయారీదార్లు కచ్చితంగా అమలు చేయాలని అదేశించారు. ప్రభుత్వం ఎల్లవేళలా వినియోగదారుడి పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు. తొలుత జనవరి నుంచి అమల్లోకి వచ్చిన యూనిట్ సేల్ ప్రైస్ నిబంధనపై అవగాహన కల్పించారు.

చెరువు భూమి కబ్జాపై తెలుగు యువత నేత ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చెరువు భూమి కబ్జా చేసి అక్రమంగా లేఅవుట్ వేశారని తెలుగు యువత నేత ఫిర్యాదు చేశారు. కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం రావులపాలెం మండలం లక్ష్మీపురం గ్రామంలో ఆమదాల చెరువుకు సంబంధించిన దాదాపు ఐదు ఎకరాలకు పైగా భూమిని వైసీపీ నేత ఆక్రమించి అక్రమ లేఅవుట్‌లు వేశారని, గతంలో ఏపీసీసీఎల్‌కి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని... ఆక్రమణపై చర్యలు తీసుకోకుండా నాటి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అడ్డుకున్నాడని... దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రావులపాలెం తెలుగు యువత అధ్యక్షుడు కోట చంద్రశేఖర్ మంగళవారం టీడీపీ వినతుల స్వీకరణ కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. మంగళగిరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ప్రజలు, పార్టీ నేతల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా బాధితుల సమస్యలపై సంబంధిత అధికారులు, కలెక్టర్లు, నేతలకు ఫోన్లు చేసి సమస్యలను తెలియపరిచి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. తన కూతురు నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ కోసం మెడికల్ అకాడమీలో చేరిందని, అక్కడ ఆహారం పడక ఆరోగ్య పరిస్థితి బాగుండలేకపోవడంతో మధ్యలో మానుకోవాల్సి వచ్చిందని... అప్పటికే రూ.50,500 ఫీజు కట్టామని, కానీ మొత్తం ఫీజు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెబుతున్నారని గుంటూరుకు చెందిన విద్యార్థిని తండ్రి గద్దం వెంకటేశ్వర్లు... కేంద్ర మంత్రికి వివరించారు. వెంటనే స్పందించి అకాడమీ నిర్వాహకులకు ఫోన్ చేసి విద్యార్థిని సర్టిఫికెట్లు ఇవ్వాలని సూచించారు. కాగా నామినేటెడ్ పదవుల కోసం అనేక మంది టీడీపీ నేతలు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు తమ వినతులు అందించారు.

సంపాదకీయం

సమన్యాయం లేని న్యాయ సూత్రాలు

చట్టాలు సంక్లిష్టమైనవి. దీనికి కారణాలు ఉండొచ్చు. చట్టాలు సులభమైన భాషలో ఉండి, సామాన్యులకు కూడా అర్థమయ్యే రీతిలో ఎందుకు ఉండవో అర్థం కాదు. చట్టాల్లో సంక్లిష్టత ఉంటుందని అంగీకరించినా న్యాయం కూడా అందరికీ ఒకేలా ఎందుకు ఉండదో కూడా అంతుపట్టని వ్యవహారంగానే ఉంది. అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు నిర్దేశించే న్యాయ సూత్రాలు, ఆదేశాలు కూడా అందరి విషయంలో సమానంగా వర్తించవు. అంతెందుకు సుప్రీంకోర్టు నిర్దేశాలు కింది కోర్టులకు ఒక రకంగా, కొన్ని హైకోర్టులకు ఇంకో రకంగా, సుప్రీంకోర్టులోనే కొందరు న్యాయమూర్తులకు మరో రకంగా ఎందుకు అర్థం అవుతాయో తెలియదు. బెయిలు హక్కు, జైలు అత్యవసరం అయితేనే అన్న న్యాయ సూత్రాన్ని నిర్దేశించింది సుప్రీంకోర్టే. కాని అమలులోకి వచ్చే దగ్గరికి ఈ సూత్రం ఒక్కో సందర్భంలో ఒక్కో రకంగా అమలవుతోంది. ఢిల్లీ మద్యం కేసులో నిందితురాలైన తెలంగాణ రాష్ట్ర సమితి (టి.ఆర్.ఎస్.) ఎమ్మెల్సీ, టి.ఆర్.ఎస్. అధినేత కె.చంద్రశేఖర రావు (కె.సి.ఆర్.) కూతురు కల్వకుంట్ల కవితకు మంగళవారం బెయిలు మంజూరు చేయడంలో అనేక ధర్మ సూక్ష్మాలు ఇమిడి ఉన్నట్టు కనిపిస్తోంది. బెయిలు హక్కు కనక ఆమెకు అత్యున్నత న్యాయస్థానం బెయిలు మంజూరు చేసిందనుకోవచ్చు. ఇదే మద్యం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ గత మార్చి నుంచి జైలులో ఉన్నారు. మధ్యలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనడానికి అనువుగా కొద్ది రోజులు ఆయనకు తాత్కాలిక బెయిలు మంజూరు అయింది. ఆ గడువు పూర్తి కాగానే ఆయన మళ్లీ కటకటాలు లెక్కించవలసి వస్తోంది. ఢిల్లీ మద్యం కేసులో 17 నెలల సుదీర్ఘ కాలం జైలులో గడిపిన ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ఇటీవలే బెయిలుపై విడుదలయ్యారు. ఆమ్ ఆద్మీ పార్టీ మరో నాయకుడు సంజయ్ సింగ్‌కు కూడా బెయిలు వచ్చింది. ఇప్పుడు కవితకు బెయిలు వచ్చింది. వీరందరూ కింది స్థాయి కోర్టుల నుంచి మొదలుకొని హైకోర్టు, సుప్రీంకోర్టు మెట్లు ఎక్కి దిగిన వారే. మనీశ్ సిసోడియాకు బెయిలు మంజూరు చేసినప్పుడు మద్యం కుంభకోణంతో, ద్రవ్య అక్రమ చెలామణితో ఆయనకు సంబంధం ఉందని ప్రాసిక్యూషన్ రుజువు చేయనందువల్ల బెయిలు ఇస్తున్నామని సుప్రీంకోర్టు ప్రకటించింది. దాదాపు ఇదే సూత్రం ఆధారంగా కవితకు బెయిలు మంజూరు అయింది. అంటే ఢిల్లీ మద్యం కేసులో దాదాపు 50 మంది ఉంటే ఇందులో ప్రముఖులకు బెయిలు వచ్చింది. కొందరు నిందితులు అప్రూవర్లుగా మారి ప్రభుత్వానికి అనుకూలంగా, తమతోపాటు అరెస్టు అయిన వారికి వ్యతిరేకంగా వాంగ్మూలాలు ఇస్తున్నారు. ఈ కేసంతా తెమిలే సరికి ఎంత కాలం పడుతుందో తెలియదు. కానీ అప్రూవర్లను భిన్నమైన దృష్టితోనే చూస్తారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు బి.ఆర్.గవై, వి.విశ్వనాథన్ మంగళవారం కవితకు బెయిలు మంజూరు చేస్తూ చేసిన వ్యాఖ్యలనుబట్టి చూస్తే ఈ కేసు విచారణా స్వరూపమే మారిపోవచ్చుననిపిస్తోంది. ఢిల్లీ మద్యం కేసు వ్యవహారం రూ. వంద కోట్లకు పైమాటే అంటున్నారు. ఇందులో ద్రవ్య అక్రమచలాణీ వ్యవహారం, అవినీతి లాంటి అంశాలు ఉన్నాయంటున్నారు. కానీ నిందితుల దగ్గరనుంచి ఒక్క రూపాయి కూడా పట్టుబడలేదు. ఆ డబ్బు ఎలా అక్రమంగా వినియోగించారో ప్రాసిక్యూషన్ ఇప్పటి దాకా రుజువు చేయలేక పోయింది. ఈ సందర్భాగానే ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి.) నడవడికను అనేక సార్లు చీదరించుకుంది. అప్రూవర్లుగా మారిన వారు ఇచ్చే వాంగ్మూలాలు సంపూర్ణంగా నమ్మనక్కర్లేదు అని కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. కవితకు మద్యం కుంభకోణంతో సంబంధం ఉన్నట్టు రుజువులు చూపించండి అని అత్యున్నత న్యాయస్థానం నిలదీసింది. సీబీఐ, ఇ.డి. దర్యాప్తు చేస్తున్న తీరును తప్పు పట్టింది. ప్రాసిక్యూషన్ చేసిన వితండవాదాలను కూడా న్యాయమూర్తులు తోసి పుచ్చారు. కవిత తన ఫోన్‌లో కొంత సమాచారాన్ని తొలగించారు అని ప్రభుత్వ పక్షం తరఫున వాదించిన అడిషనల్ సోలిసిటర్ జనరల్ అన్నప్పుడు ఫోన్ వ్యక్తిగతమైంది, దానిలో సమాచారం తొలగించడం, చేర్చడం లాంటివి తప్పు కాదు అని న్యాయమూర్తులు మందలించే స్థాయిలో మాట్లాడారు.

ఒక్క మద్యం కేసులోనే కాదు వివిధ కేసుల్లో కింది నుంచి పై దాకా న్యాయస్థానాలు బెయిలు మంజూరు చేయడం లేదా నిరాకరించడంలో ఏక సూత్రత లేదు. బెయిలు హక్కు అన్న సుప్రీంకోర్టు నిర్దేశం ఒకే రీతిలో అమలవుతున్నట్టు కనిపించడం లేదు. ఢిల్లీ మద్యం కేసులో బెయిలు మంజూరైన నిందితులందరూ ఎన్నో కోర్టులను ఆశ్రయించవలసి వచ్చింది. అత్యున్నత న్యాయస్థానం తన నిర్దేశాన్ని కచ్చితంగా అమలు చేస్తున్నప్పుడు బెయిలు మంజూరు అవుతోంది. బెయిలు హక్కు అన్న సుప్రీంకోర్టు నిర్దేశం ఇతర సందర్భాలలో ఎలా అమలు అవుతోందో ఆశ్చర్యపడవలసి వస్తోంది. ఉదాహరణకు భీమా కోరేగావ్ కేసులో మొత్తం 16 మంది అరెస్టయితే ఏడుగురికి బెయిలు మంజూరు అయింది. ఎవరికి బెయిలు ఎందుకు ఇచ్చారు అన్న విషయంలో తేడాలు ఉండొచ్చు. ఈ పదహారు మందిలో గౌతం నవలఖా, షోమా సేన్, సుధా భరద్వాజ్, ఆనంద్ తెల్తుంబ్డే, అరుణ్ ఫెరీరా, వరవర రావు, వెర్నాన్ గొన్సాల్వేస్‌కు బెయిలు దొరికింది. డా. స్టాన్ స్వామి నిర్బంధంలో ఉండగానే మరణించారు. వీరందరినీ 2018లో అరెస్టు చేశారు. రోనా విల్సన్, సురేంద్ర గాడ్లిల్, మహేశ్ రౌత్, సుధీర్ ధవాలే, హనీ బాబు, రమేశ్ గైచోర్, సాగర్ గోర్ఖే, జ్యోతి జగతాప్ - మొత్తం ఎనిమిది మంది ఆరేళ్ల నుంచి జైలులోనే మగ్గుతున్నారు. ఢిల్లీ మద్యం కేసులో మనీశ్ సిసోడియాకు బెయిలు మంజూరు చేసినప్పుడు విచారణ ఊసే లేకుండా సుదీర్ఘ కాలం ఏ వ్యక్తినీ నిర్బంధిస్తే అది వ్యక్తి స్వేచ్ఛను హరించడం, మరీ మాట్లాడితే రాజ్యాంగంలోని 21 వ అధికరణాన్ని ఉల్లంఘించడమేనని సుప్రీంకోర్టు చెప్పిన సూత్రం భీమా కోరేగావ్ కేసులో ఎందుకు అమలు కావట్లేదో అంతుపట్టదు. కొలబద్ద ఒకటే అయినప్పుడు కొలతల్లో తేడాలు ఎందుకొస్తాయి. 2020 నాటి ఈశాన్య ఢిల్లీ మతకలహాల కేసులో ఇరికించి అరెస్టు చేసిన జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జె.ఎన్.యు.) పరిశోధక విద్యార్థి ఉమర్ ఖాలిద్ 2020 సెప్టెంబర్ నుంచి జైలులోనే మగ్గుతున్నారు. ఆయన కూడా సుప్రీంకోర్టునూ ఆశ్రయించారు. వాయిదాల మీద వాయిదాలకు హాజరయ్యారు. అంతకు ముందు హైకోర్టు ఆయనకు బెయిలు నిరాకరించింది. సుప్రీంకోర్టూ కరుణించలేదు. చివరకు ఉమర్ ఖాలిద్ కేసు మళ్లీ కింది స్థాయి కోర్టులో విచారణకు వెళ్లింది. ఇలాంటి కేసులన్నింటిలో వేల పేజీల సమాచారం పోగుపడ్తుంది. వందల మంది సాక్షులను ప్రభుత్వం అనేక సందర్భాలలో విచారణ ఎప్పుడు మొదలవుతుంది అన్న ప్రశ్నకు ప్రాసిక్యూషన్ తెల్లమొహం వేస్తుంది. విచారణే ప్రారంభం కానప్పుడు ఎప్పుడు ముగుస్తుందో ఎవరికీ తెలియదు. నిందితులు ఏళ్ల తరబడి విచారణ ఊసే లేకపోయినా విచారణలో ఉన్న ఖైదీలుగా కటకటాలు లెక్కిస్తూనే ఉండి పోవాల్సి వస్తోంది. అంటే రాజ్యాంగం లోని 21 వ అధికరణానికి కూడా దిశా నిర్దేశం కొరవడిన వ్యవస్థలో నిర్బంధం తప్పదేమో!

మారుతున్న జార్ఖండ్ రాజకీయం

డా॥ జ్ఞాన్ పాఠక్



త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న జార్ఖండ్‌లో రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి, జేఎంఎం సీనియర్ నేత చంపై సోరెన్ ఈ నెల 30వ తేదీన బీజేపీ తీర్థంపుచ్చుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఇండియా ఐక్య సంఘటన రాజకీయ వ్యూహాన్ని మార్చనున్నది. చంపై సోరెన్ పార్టీని వీడిన నేపథ్యంలో నష్టనివారణ చర్యలలో భాగంగా రాష్ట్రంలోని పాలక పార్టీ జేఎంఎం పావులు కదుపుతోంది. వివిధ పార్టీలలో చీలికలు తెచ్చి కొంతమందిని తమ పార్టీలో చేర్చుకుని అక్కడ ఎన్నికల్లో గెలవడానికి బీజేపీ నిత్యం వ్యూహాలు పన్నుతోంది. జార్ఖండ్‌లోనూ బీజేపీ జార్ఖండ్ ముక్తిమోర్చా (జెఎంఎం) నుంచి చంపైసోరెన్‌కు గాలం వేసింది. తమ పార్టీలోకి వచ్చేవారికి ఏవో ఆశలు చూపి పార్టీలో చేర్చుకోవటం బీజేపీకి బాగా అలవాటయ్యింది. జెఎంఎంలో కీలకమైన నాయకుడిగా పరిగణించే చంపై సోరెన్‌ను ఆగస్టు 30 వ తేదీన బీజేపీ తమ పార్టీలో చేర్చుకుంటున్నది. చంపై జెఎంఎం నుంచి వైదొలగి బీజేపీలో చేరాలని ఢిల్లీ పెద్దల చుట్టూ తిరిగారు. తాను అనుకున్నది సాధ్యం కాదేమోనని భావించిన చంపై కొత్త పార్టీ పెడదామని కూడా ఆలోచించాడు. చివరకు బీజేపీలో కలిసిపోవాలని చంపై నిర్ణయించుకున్నాడు. చంపై నిష్క్రమణతో నష్ట నివారణకు జేఎంఎం కీలక చర్యలు తీసుకుంటోంది. ఈ దశలో ఇండియా ఐక్య సంఘటనతో కలిసి తక్షణం రాజకీయ వ్యూహాన్ని పునర్నిర్మించుకోవాలని భావిస్తోంది. అక్రమ కేసులు బనాయించి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్‌సోరెన్‌ను అక్రమంగా అరెస్టు చేయటంతో అప్పుడు చంపైసోరెన్‌ను ముఖ్యమంత్రిగా నియమించారు. ఆయన ముఖ్యమంత్రి బాధ్యతలను చేపట్టిన తరువాత అందులోనే కొనసాగాలని ఆశపడ్డారు. అది నెరవేరలేదు. 2024 జులై 4 వ తేదీన హేమంత్‌సోరెన్ ఈడీ కేసులో బెయిలు పొంది జైలు నుంచి విడుదలయ్యారు. చంపైసోరెన్‌కు హేమంత్‌సోరెన్ ముఖ్యమంత్రి బాధ్యతలు 2024 ఫిబ్రవరి 2న అప్పగించారు. ఇండియా ఐక్య సంఘటనలో భాగస్వాములు ఈ ఏర్పాటును ఆమోదించారు. చంపై పార్టీ నుంచి బయటకు వెళ్లినప్పటికీ పార్టీకి మద్దతు తెలియజేసే నాయకులు, కార్యకర్తలు పార్టీలోనే ఉన్నారు. చంపైతో కలిసి ఏ నాయకుడు బయటకు వెళ్లడంలేదు.

ఈ నెల 30 వ తేదీన చంపై, ఆయన కుమారుడు బీజేపీలో చేరనున్నారు. జెఎంఎం నుంచి నాయకులుగాని, ముఖ్య కార్యకర్తలు గాని చంపైని అనుసరించటంలేదు. చంపైకి కొల్హాన్ ప్రాంతంలో గణనీయమైన పలుకుబడి ఉన్నదని చెప్తారు. ఈ ప్రాంతంలో 14 అసెంబ్లీ నియోజక వర్గాలున్నాయి. వీటిలో తొమ్మిది షెడ్యూల్డ్ ట్రైబ్‌కు రిజర్వు చేశారు. ఒక నియోజక వర్గాన్ని షెడ్యూల్డ్ కులాలకు రిజర్వు చేశారు. జనరల్ స్థానాలు నాలుగే ఉన్నాయి. 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జెఎంఎం 30 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జెఎంఎం గెలిచిన సీట్లలో 11 కొల్హాన్ ప్రాంతంలో ఉన్నాయి. జెఎంఎం ఎస్టీ స్థానాలలో ఎనిమిదింటిని గెలుచుకుంది. ఎస్సీ సీటును కూడా ఇదే పార్టీ గెలుచుకుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని బీజేపీ రకరకాల ఎత్తుగడలు, ప్రయత్నాలు చేసి బహుశా చంపైకు అవసరమైన కోర్కెలను తీర్చి తమ పార్టీలో చేర్చుకుంటున్నది. చంపై తమ వైపు మళ్లినందున బీజేపీ ఉత్సాహంతో ఉంది. త్వరలో శాసనసభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జెఎంఎం ఈసారి కూడా గెలవడానికి గట్టిగా కృషి చేయవలసి ఉంటుంది. ఇటీవల ముగిసిన పార్లమెంట్ ఎన్నికలలో వలే కాకుండా భావసారుప్యత కలిగిన పార్టీల ఓట్లు చీలకుండా అందరినీ ఐక్యం చేసేందుకు జేఎంఎం, కాంగ్రెస్ తీవ్రంగా కృషిచేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో అధికారం కైవసం చేసుకునేందుకు బీజేపీ చేయాల్సిన అన్ని ప్రయత్నాలను చేస్తుందనడంలో అనుమానంలేదు. 2019 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొల్హాన్ ప్రాంతంలో ఏమాత్రం సీట్లు గెలుచుకోలేదు. ఇండియా ఐక్య సంఘటనలో భాగస్వామి అయిన కాంగ్రెసు రెండు సీట్లు గెలుచుకుంది. వీటిలో ఒకటి ఎస్టీ సీటు. బీజేపీ ముఖ్యమంత్రిగా పనిచేసిన రఘుభర్‌దాస్ 14వ స్థానంలో పోటీచేసి ఓడిపోయారు. అయితే బీజేపీ తిరుగుబాటుదారు సరయురాయ్ ఇండిపెండెంట్‌గా పోటీచేసి గెలుపొందాడు. 2019 లో ఒక్క సీటు కూడా గెలవని బీజేపీ ఈసారి అసెంబ్లీలో అడుగుపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

2024 లోక్‌సభ ఎన్నికలు జరిగే సమయంలో హేమంత్‌సోరెన్ జైలులో ఉన్నాడు. ఆయన పార్టీ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడిగా ఉన్నారు. అయినప్పటికీ బీజేపీ ఎక్కువ సీట్లు గెలవలేకపోయింది. హేమంతసోరెన్‌ను జైలులో పెట్టిస్తే తమకు ప్రయోజనం కలుగుతుందని బీజేపీ అనుకున్నప్పటికీ అది నెరవేరలేదు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 11 సీట్లు గెలుచుకున్న బీజేపీ ఈసారి మూడు సీట్లు కోల్పోయింది. 2019 లో44.60 శాతం ఓట్లు పొందిన బీజేపీ 2024 లో 7శాతం ఓట్లను కోల్పోయింది. బీజేపీతో కలిసి పోటీచేసిన ఎజెఎస్‌యు గతంలో గెలిచిన ఒక సీటును నిలుపుకుంది. ఈ పార్టీ 1.78 శాతం ఓట్లను కోల్పోయింది. చంపై బీజేపీలోకి వెళ్లినప్పటికీ బీజేపీ కోల్పోయిన సీట్లు, ఓట్లును తిరిగి గెలుచుకునే అవకాశం అంతగా ఉండబోదని విశ్లేషిస్తున్నారు. 81 అసెంబ్లీ నియోజకవర్గాలకు 26 సీట్లలో బీజేపీకి ఆధిక్యత ఉండవచ్చునని అంచనా వేశారు. ఏమైనప్పటికీ జెఎంఎంకు బీజేపీ తలనొప్పిగా ఉండవచ్చు. బీజేపీతో కలిసివున్న ఎజెఎస్‌యు, అయిదు అసెంబ్లీ సీట్లలో ఆధిక్యత కలిగి ఉన్నదని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జెఎంఎం 30 సీట్లతో ప్రభుత్వాన్ని నడుపుతున్నది. లోక్‌సభ ఎన్నికలలో 15 అసెంబ్లీ స్థానాల పరిధిలో ఆధిక్యత కలిగి ఉన్నది. కాంగ్రెస్ రెండు లోక్‌సభ సీట్లను గెలుచుకుని 19.19 శాతం ఓట్లు పొందింది. గతం కంటే 3.39 శాతం ఓట్లను పెంచుకున్నది. జెఎంఎం, ఇండియా ఐక్య సంఘటన నాయకత్వంతో కలిసి చర్చించి కొత్త వ్యూహాన్ని రచించనున్నది.

పాలనా సంక్షోభం: ప్రత్యామ్నాయ రాజకీయం

డి వి వి ఎస్ వర్మ

దేశంలో రాజకీయ సంక్షోభం పొంచి వుందన్న ఊహాగానాలు వస్తున్నాయి. మోదీ ప్రభుత్వం బలహీనపడిన మాట వాస్తవం.మోదీ ఏక పక్షంగా వ్యవహరించడం సాధ్యం కాదు. గతం లో ఎన్డీయే నుంచి విభేదించి బయటకు పోతామంటే తలుపులు తెరచి సాగనంపే స్థితి లేదు. ఇప్పుడు మోదీ తన మిత్రులతో సర్దుకు పోవాలి. లేకపోతే మొదటికే మోసం వస్తుంది. అధికార పీఠం గల్లంతు అవుతుంది. అంతటి దుస్సాహసానికి మోదీ పూనుకునే అవకాశం ప్రస్తుతానికి లేదు. అలాగే మోదీ కూటమిలో వున్న రెండు ప్రధాన పక్షాలు రెండు పెద్ద రాష్ట్రాల్లో అధికారంలో వున్నాయి. అవి తమ మనుగడ కోసం మోదీ ప్రభుత్వం మీద ఆధారపడక తప్పని స్థితి వుంది. ఈ నేపథ్యంలో దేశంలో రాజకీయ సంక్షోభం కొంతకాలం వాయిదాపడే అవకాశమే ఎక్కువగా కనిపిస్తోంది.

ప్రస్తుతం దేశంలో ఒక కొత్త తరహా సంక్షోభం పుట్టుకొచ్చింది. పాలక పక్షాల పాలనా సంక్షోభం దేశాన్ని చుట్టుముడుతోంది. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ పాలక పక్ష రాజకీయంలో సంక్షోభ దశ మొదలైంది. "అప్పులతో అభివృద్ధి - బడ్జెట్ పరిధిలో సంక్షేమం" అన్న విధానాల అమలుకు కాలం పరిసమాప్తం కానుంది... ప్రజలపై మరింత భారం మోపి అదనపు నిధులు సమకూర్చుకునే దారులు మూసుకు పోతున్నాయి. 2014లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి 50 లక్షల కోట్లుగా వున్న అప్పులు 2025 నాటికి 1 కోటి 82 లక్షల కోట్లకు చేరుకుంటుంది. దానికి చెల్లించాల్సిన వడ్డీ ఏటా 11 లక్షల కోట్లు. కేంద్ర బడ్జెట్‌లో అత్యధిక కేటాయింపు దీనికే దక్కింది. ఈ ఏడాదికి కొత్తగా చేసే అప్పు 14 లక్షల కోట్లు. వడ్డీకి పోగా మిగిలేది మూడు లక్షల కోట్లే. ఈ సంవత్సరం కొత్త అప్పు తగ్గింది అవసరాలు లేక కాదు అప్పులు పుట్టని స్థితికి చేరుకున్నాం. పర్యవసానంగా సంక్షేమానికి కత్తిరింపులు వేశారు. మొత్తం మీద బడ్జెట్‌లో అభివృద్ధికి అవసరమైన నిధులు, తాత్కాలిక ఉపశమనానికి పేదల సంక్షేమానికి నిధులు లేవు. రాష్ట్రాలకు అదనపు నిధులిచ్చే పరిస్థితి లేకపోగా పన్నుల పంపకంలోనూ రకరకాల పద్ధతుల్లో కోతలు పెడుతున్నారు.

దీనితో రాష్ట్ర ప్రభుత్వాల స్థితి మరింత దారుణంగా మారింది. అవి ఇప్పటికే అప్పుల కుప్పలుగా వున్నాయి. ఎన్నికల్లో గెలుపు కోసం చేసిన వాగ్దానాలు నెరవేర్చలేని స్థితిలో సతమతమౌతున్నాయి. ప్రస్తుత ఆర్థిక వనరుల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధిని ముందుకు సాగించే అవకాశాలు లేవు. వీటి బడ్జెట్ల పరిధిలో తాత్కాలిక ఉపశమన సంక్షేమ పథకాలు విస్తరించే వీలులేదు. ఈ తరహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాజకీయ పాలనా విధానాలు అనివార్యంగా సంక్షోభంలో పడతాయి. ఈ సంక్షోభం నుంచి దేశ ప్రజలను ఒడ్డుకు చేర్చడానికి ప్రత్యామ్నాయ రాజకీయం తక్షణ అవసరం అవుతుంది. ముందుగా గత పదేళ్ల మోదీ పాలనలో భారత్ ప్రపంచంలోనే అత్యధికంగా అంతరాలు పెరిగిన దేశంగా మారింది. 2013 నాటికి 50 మంది బిలియనీర్లు అంటే 100 కోట్లకు పైబడిన డాలర్ల సంపదగలవారు లేదా 8000 కోట్ల రూపాయలకు పైబడిన సంపద గల వారు వుంటే 2024 నాటికి 169 మంది బిలియనీర్లు పుట్టుకొచ్చారు. ప్రపంచ బిలియనీర్లలో అమెరికా, చైనా తర్వాత మూడో స్థానానికి దూసుకు పోయింది ఈ 169 మంది బిలియనీర్ల దగ్గరే 78 లక్షల కోట్ల సంపద పోగుపడింది.

ఆక్స్ ఫామ్ నివేదికల ప్రకారం దేశంలో 1 శాతం దగ్గర 46 శాతం దేశ సంపద పోగుపడగా 10 శాతంగా వున్న బిలియనీర్లు, కార్పొరేట్లు, కుబేరుల దగ్గర మొత్తం దేశ సంపదలో 77 శాతం గుట్టపడింది. ఇలా ఒక దశాబ్ద కాలంలోనే జరిగిన అరుదైన దేశ సంపద కేంద్రీకరణ స్థూలంగా 10 ఏళ్ల మోదీ పాలన ప్రధానంగా కార్పొరేట్ల కోసం సాగిన పాలన. దాని పర్యవసానంగానే దేశ సంపద వారి పంచకు చేరింది. ఈ 10 ఏళ్లలో 35 శాతంగా వున్న కార్పొరేట్ పన్నును అంచెలంచెలుగా 22 శాతానికి తగ్గించారు. వారికే దాదాపు 20 లక్షల కోట్ల అప్పులను రద్దు చేశారు. గతంలో 10 శాతం వున్న వారసత్వ పన్నును పూర్తిగా తొలగించారు. ఇది మోదీ పాలన సంగ్రహ చిత్రం. దేశంలో ప్రస్తుతం నెలకొన్న ప్రధాన వైరుధ్యాన్ని ఇది స్పష్టం చేస్తున్నది. దేశ సంపదను కార్పొరేట్లు సొంతం చేసుకుంటూ పోతున్నారు. మరో పక్క కార్పొరేట్ల అనుకూల పాలనలో రైతులు, సామాన్యులు, పేదలు నలిగి పోతున్నారు. 10 శాతం గా వున్న కార్పొరేట్ల దోపిడీకి- 75 శాతం నలిగి పోతున్న దేశ ప్రజలకీ మధ్య నెలకొన్న వైరుధ్యమే ప్రస్తుత ప్రధాన వైరుధ్యంగా గుర్తించాలి. కార్పొరేట్లను కట్టడి చేసి వారి దగ్గర పోగుపడ్డ సంపదను పునః పంపిణీ చేసే నినాదం తప్పనిసరి అవుతుంది. దేశంలో 10 శాతం దగ్గర పోగుపడ్డ సంపదను పునః పంపిణీ అన్నది ప్రత్యామ్నాయ రాజకీయం నినాదం కావాలి. ఇది కార్పొరేట్ల మీద నాలుగు పన్నులు విధించడం ద్వారా సులభంగా సాధించ వచ్చును. మొదటిది ప్రస్తుతం 22 శాతంగా వున్న కార్పొరేట్ పన్నును మరికొంత పెంచడం. రెండవది సంపద పన్నును వృద్ధి క్రమానుగతంగా విధించడం, మూడవది ప్రస్తుతం వున్న కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పన్నును వృద్ధిక్రమానుగతంగా విధించి దానిని జాతీయ సంక్షేమ నిధిగా మార్చడం. నాలుగవది తొలగించిన వారసత్వ పన్ను స్థానంలో తిరిగి ప్రపంచ దేశాల స్థాయిలో విధించడం. ఇవి కార్పొరేట్ల దగ్గర పోగుపడ్డ సంపద పునఃపంపిణీకి దారితీస్తుంది. దేశంలో నిజమైన ప్రత్యామ్నాయ సంక్షేమ రాజ్యాన్ని సాధించ గలుగుతుంది.

పైన సూచించిన నాలుగు పన్నులో 1 శాతం మంది దగ్గర పోగుపడ్డ సంపద మీద కనీసం 2 శాతం సంపద పన్ను విధిస్తే 8 లక్షల కోట్లు వస్తాయని, మూడోవంతు వారసత్వ పన్ను విధిస్తే 6.67 లక్షల కోట్లు వస్తాయని ప్రముఖ ఆర్థిక తత్వవేత్త ప్రభాత్ పట్నాయక్ లెక్క తేల్చారు. పైన పేర్కొన్న నాలుగు పన్నులనూ దేశంలో 10 శాతం కుబేరుల మీద వృద్ధిక్రమానుగతంగా విధిస్తే 20 లక్షల కోట్లకు మించిన అదనపు నిధులు సమకూరతాయి. అయినా ఇలా పునఃపంపిణీకి పన్నుల ద్వారా తీసుకునే సొమ్ము కుబేరుల సంపదలో అతి చిన్న భాగంగానే వుంటుంది.

దారి దీపం సంపాదకులు - 85006 78977

ఫాసిజమా ? లేక ప్రత్యామ్నాయ రాజకీయమా?

పాలనా సంక్షోభ కాలం సుదీర్ఘ కాలం వుండదు. పరిష్కారానికి ఏదో ఒక మార్గాన్ని ఎంచుకుంటుంది. కార్పొరేట్ల పెత్తనం కొనసాగించడానికి పాలకపక్షం మెజారిటీ మతవాద నినాదాన్ని జతకలిపి దమనకాండ తో సాగించే ఫాసిస్టు మూకల పాలన రూపం ధరిస్తుంది లేదా ప్రత్యామ్నాయ రాజకీయం ఒక ఉద్యమంగా విస్తరించి ప్రజా సంక్షేమ రాజ్యాన్ని సాధిస్తుంది.

ప్రజా ఉద్యమంగా ప్రత్యామ్నాయ రాజకీయం

ప్రత్యామ్నాయ రాజకీయం పూర్తిగా భిన్నమైంది. వ్యవస్థాగత మార్పులను సాధించే లక్ష్యం కోసం, ప్రజల నిత్యజీవన సమస్యల పరిష్కారం కోసం సాగించాల్సిన ఉద్యమం. దీనికి కేవలం అధికార మార్పిడి మాత్రమే ఏకైక లక్ష్యం కాదు. వ్యవస్థాగత మార్పులను సాధించే అధికార మార్పిడి లక్ష్యంగా వుంటుంది. ప్రత్యామ్నాయ రాజకీయం ఒక కొత్త రాజకీయం. ప్రస్తుత పాలకపక్ష రాజకీయం ప్రజలను "లబ్ధి దారులను" చేసింది. ప్రత్యామ్నాయ రాజకీయం వారిని " హక్కు దారులను" చేస్తుందనే కొత్త ఆకాంక్షలను ప్రజల్లో కల్పించాలి. మొదటగా పాలనా సంక్షోభ పరిష్కారానికి తగిన ప్రత్యామ్నాయ రాజకీయానికి అత్యధికులకు మేలు చేసే 'సంపద పునః పంపిణీ' అన్నది నినాదం. రెండవది నాలుగు రకాల పన్నుల ద్వారా కార్పొరేట్ల సంపదను కట్టడి చేసి ఆచరణ సాధ్యమైన అదనపు నిధుల సమీకరణ మార్గాలు వెల్లడించడం. మూడవది సంపద పునః పంపిణీ ద్వారా హక్కుగా పొందే సంక్షేమం, స్వతంత్ర జీవనం గురించి కొన్ని ప్రతిపాదనలు వుంటే ప్రత్యామ్నాయ రాజకీయ ప్రజా ఉద్యమానికి అవసరమైన మూడు అంశాలు పరిపూర్తి అవుతాయి. బడ్జెట్ నిధులతో పాటు సంపద పునఃపంపిణీ అదనపు నిధులతో శ్రమజీవులకు, పేదల కుటుంబాలకు స్వతంత్ర జీవనాన్ని ఇచ్చే మౌలిక ఆదాయాన్ని కల్పించడం.

అందరికీ ఉచితంగా మంచి ప్రమాణాల విద్య, వైద్య సేవలు, ఆహార భద్రత, నివాస వసతులను హక్కుగా కల్పించడం. కులపరమైన లింగ పరమైన మతపరమైన వివక్షను తొలగించడానికి ప్రత్యేక నిధుల కేటాయింపు. స్వామినాథన్ కమిషన్ సూచన మేరకు చట్టబద్ధంగా వ్యవసాయ పంటలన్నింటికీ లాభసాటి ధరలు అందించడం. పంటల వారీగా రైతులే నిర్వహించుకునే ప్రత్యామ్నాయ మార్కెట్లకు నిధులు, నిరుద్యోగులకు అర్హతకు తగిన ఉపాధి కల్పనకు ప్రభుత్వ పెట్టుబడులను పెంచడం, వృద్ధులకు, వేతన జీవులకు ఆదాయ పన్ను మినహాయింపు గణనీయంగా పెంచడం తదితరాలు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.

బొగ్గు గనులపై అదానీ గ్రూపు ఆధిపత్యం !

బొల్లిముంత సాంబశివరావు

భారతదేశంలో బొగ్గుకి ప్రత్యేక స్థానం ఉంది. దేశ పారిశ్రామిక ఉత్పత్తికి అవసరమైన విద్యుత్ ఉత్పత్తి చేసే థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గే ఆధారం. ప్రాధాన్యత గల బొగ్గు ఉత్పత్తి ప్రభుత్వ సంస్థల నుంచి ప్రైవేట్ సంస్థల చేతుల్లోకి పోతున్నది. ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉన్న బొగ్గు గనులన్నీ ప్రైవేట్ సంస్థలు పరమౌతున్నాయి. ఫలితంగా బొగ్గు కొరత ఏర్పడి అధిక రేటుకి ప్రభుత్వ ఆధ్వర్యంలోని విద్యుత్ సంస్థలు బొగ్గును ప్రైవేట్ సంస్థల నుంచి కొనుగోలు చేస్తున్నాయి. అదానీ ఎంటర్ ప్రైజెస్ దేశంలోనూ, విదేశాల్లో ప్రభుత్వాల అండతో అనేక బొగ్గు గనులను సొంతం చేసుకుంది. ఎన్డీయే ప్రభుత్వం వేలం వేసిన బొగ్గు గనుల్లో అదానీ గ్రూప్ మోదీ అండతో ఎక్కువ గనులను పొందింది. బొగ్గు బ్లాకులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రత్యేక నిబంధన సరి కాదనీ పారదర్శకత లోపించిందని ప్రధాని మోదీ కార్యాలయం నిర్ధారించిన తర్వాత కూడా ఆయన ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు మినహాయింపులు ఇచ్చింది. మోదీకి అత్యంత ఆత్మీయుడైన అదానీ కోసమే ఈ మినహాయింపు కాబట్టి , అదానీ గ్రూపుకి దట్టమైన అటవీ ప్రాంతాల్లో కూడా 450 మిలియన్ టన్నుల కన్నా ఎక్కువ బొగ్గు కలిగి ఉన్న ప్రాంతంలో కూడా తవ్వకానికి అనుమతించింది. ఇలాంటి అనుమతుల వలన అటవీ ప్రాంతాలకు, గిరిజనులకు తీవ్ర నష్ట జరుగుతుంది.

అదానీ ఎంటర్ ప్రైజెస్ గ్రూపు బొగ్గు గనుల ప్రాజెక్టులకు వ్యతిరేకంగా అనేక ప్రాంతాల్లో అటవీ గ్రామాల గిరిజనులే కాకుండా అటవీ పక్క గ్రామాల ప్రజలు కూడా ఆందోళన చేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో ధీరౌలీ బొగ్గు గని అతి పెద్దది. దీని విస్తీర్ణం 2,672తో అడవులు, పొలాలు, గ్రామాలతో విస్తరించి ఉంది. 558 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఈ బ్లాక్ అదానీ గ్రూపు అనుబంధ సంస్థ స్ట్రాటాటిక్ మినరల్ రీసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధీనంలో ఉంది. ఈ బ్లాక్ నుంచి సంవత్సరానికి 6.5 మిలియన్ టన్నుల బొగ్గు తీసేందుకు, అందులో 90 శాతం వరకు అదానీ బొగ్గు విద్యుత్ కేంద్రానికి ఇవ్వటానికి పర్యావరణ ఆమోదంతో భారత ప్రభుత్వం అదానీ కంపెనీకి అందించింది. ఈ గనిలో బొగ్గు తవ్వకం వల్ల గిరిజనుల భూములు, అడవి, పొలాలు నాశనం అవుతాయి. ఇప్పటికే బొగ్గు రవాణా వలన ఆ ప్రాంతంలోని అనేక గ్రామాల్లో పర్యావరణ సమస్యలు ఏర్పడ్డాయి. ధీరౌలీ బ్లాక్ నుంచి బొగ్గు తీసేందుకు భారీగా అటవీ ప్రాంతాన్ని నిర్మూలించేందుకు అదానీ సంస్థ సిద్ధంగా ఉన్న సమయంలో అందుకు పర్యావరణ అనుమతి లభించటం గమనార్హం. అదానీ కంపెనీకి వ్యతిరేకంగా అటవి, భూములను కాపాడుకునేందుకు ప్రజలు ఆందోళనలు కొనసాగిస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లోని హరిహర్‌పూర్ గ్రామం రెండు భిన్న ప్రపంచాల మధ్య ఉన్నట్లు ఉంటుంది. తూర్పు వైపున దశాబ్దాల నాటి పార్సా ఈస్ట్ కాంటా బేసిన్ (పీఈకేబీ) ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ఉంది. కంటి చూపు మేర కన్పించే ఈ గని అదానీ గ్రూపు చేతికి దక్కింది. మరో వైపున " హస్ దేవ్ " అటవీ ప్రాంతంలో బిలియన్ టన్నుల బొగ్గు ఇంకా భూమిలో మిగిలే ఉంది. మధ్య భారతంలోని దట్టమైన అటవీ ప్రాంతాల్లో " హస్ దేవ్ ' కూడా ఒకటి. దాని విస్తీర్ణం లక్షా 70వేల హెక్టార్లగా ఉంది. ఈ ప్రాంతం ఛత్తీస్‌గఢ్‌కి గుండెకాయగా పేర్కొంటారు. ఇక్కడ తలపెట్టిన కొత్త బొగ్గు గని ఏర్పాటుని గత పదేళ్లుగా గిరిజనులు, అడవి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. కొత్త గని గిరిజనుల పైన, అడవి పైనా చెడు ప్రభావం చూపుతుందని అటవీ పరిశోధన సంస్థ హెచ్చరిక చేసినా 2022 ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ ఈ గనిలో బొగ్గు బయటకు తీయటానికి అదానీ గ్రూపుకి అనుమతి ఇచ్చింది. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా ప్రజలు నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ కొత్త బొగ్గు గని విస్తరణ కోసం అడవులను నాశనం చేయటాన్ని ఎదుర్కోవటానికి "హస్ దేవ్ " అరణ్య బచావో సంఘర్షణ సమితి ప్రజలను సమీకరిస్తోంది. ప్రజాభిప్రాయ

సేకరణ కోసం గ్రామ సభలు జరుపుతున్నట్లు చెబుతూ మరొక వైపు గిరిజన ప్రజలు రాకుండా పోలీసులు బారికేడ్లు నిర్మించి పహరా పెట్టారు. గ్రామ సభల దొంగ ఆమోద పత్రాలను ప్రజలు బట్టబయలు చేశారు. గని విస్తరణకు వ్యతిరేకంగా చలో రాజధాని అంటూ 300 కిలోమీటర్ల పాదయాత్రను ప్రజలు కొనసాగిస్తున్నారు.

బిజహాన్ బొగ్గు గని: ఇది ఒడిశా రాష్ట్రం లోని రూర్కెలా ప్రాంతంలో ఉంది. ఈ బొగ్గు గని కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం 2022 మార్చిలో నిర్వహించిన బిడ్‌లో అదానీ గ్రూపు అనుబంధ సంస్థ మహానది మైన్స్ మినరల్ ప్రైవేట్ సంస్థ దక్కించుకుంది. ఈ గని బ్లాక్ కింద 604.64 హెక్టార్లలో బొగ్గు తవ్వకం జరుగుతుంది. ఈ గని తవ్వకం వల్ల 450 కుటుంబాల వారు నిర్వాసితులు అవుతారు. గని వల్ల ప్రభావిత గ్రామస్తులు మైనింగ్ ప్రాజెక్టు కొనసాగించటానికి ముందు గ్రామ సభ ఆమోదం పొందాలని డిమాండ్ చేస్తున్నారు. మెరుగైన పునరావాసం, భూములకు న్యాయమైన కొత్త భూ పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్రయోజనాలను పెంచాలని ప్రభావిత గ్రామ ప్రజలు కోరుతున్నారు. వీటిని నెరవేర్చే వరకు పనులు చేపట్ట రాదని భోగ్రాకచర్ గ్రామంలో అధికారులు డ్రోన్ సర్వే చేపట్టకుండా అదానీ కంపెనీ అధికారులను ప్రజలు అడ్డుకున్నారు.

అదానీ గ్రూపు మోసాలు: బొగ్గు గనుల లీజుల్లో ఎన్నో విమర్శలు ఎదుర్కొంటున్న అదానీ ఎంటర్ ప్రైజెస్ బొగ్గు విక్రయాల్లో కూడా అక్రమాలకు పాల్పడింది. నాణ్యత లేని బొగ్గు కారు చౌకగా కొనుగోళ్లు చేసి దాన్ని హై గ్రేడ్ బొగ్గుగా నమ్మించి ఎక్కువ ధరకు విక్రయించింది. 2014లో ఇండోనేసియా నుంచి 69,925 టన్నుల నాణ్యత లేని బొగ్గును అదానీ కంపెనీ కొనుగోలు చేసింది. దీని ధర చాలా తక్కువ. ఈ బొగ్గును హై గ్రేడ్ క్వాలిటీ బొగ్గుగా ధృవీకరించి తమిళనాడు ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న టీఏఎన్‌జీ సీవో విద్యుత్ సంస్థకు మూడు రెట్లు అధికంగా ధర పెంచి అమ్మింది. ఇలా ప్రభుత్వరంగ విద్యుత్ సంస్థల నుంచి దాదాపు 3వేల కోట్లు దోచుకున్నది. దీన్ని ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ అంతర్జాతీయ పత్రిక టైమ్స్ కథనాల్లో వెల్లడించింది. అదానీ బొగ్గు అక్రమాలు ప్రజలపై ఆర్థిక భారం మోపటమే కాకుండా వారి ప్రాణాలను కూడా ప్రమాదంలో పడవేయడమేనని పర్యావరణ నిపుణులు ఆందోళన చెందుతున్నారు. అదానీ గ్రూపు బొగ్గు అక్రమాలు ఎనిమిది సంవత్సరాలకు పూర్వమే ప్రారంభమైనాయి. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్సీ (డీఆర్ఐ) అదానీ సంస్థల అక్రమాలను గుర్తించింది. ఇండోనేసియా నుంచి బొగ్గు దిగుమతి చేసుకుంటూ దేశంలో బొగ్గు కృత్రిమ కొరతను సృష్టిస్తూ, దాన్ని విదేశాలకు డబ్బులు తరలించే మార్గంగా ఎంచుకున్నారని 2016లో అదానీతో సహా 40 మందికి డీఆర్ఐ నోటీసులు ఇచ్చింది. పోర్టుల్లో దిగుమతైన బొగ్గుకు చూపించిన ధరల్లో 50 శాతం తక్కువ ధరకి కొనుగోలు చేస్తున్నారని, బొగ్గుతో తయారైన విద్యుత్‌ను అధిక ధరలకు అమ్ముకొంటున్నారని ఆరోపించింది. డీఆర్ ఐ దర్యాప్తును ఆపి వేయాలని బాంబే హైకోర్టు నుంచి అదానీ గ్రూపు స్టే తెచ్చుకుంది. దేశంలోని అనేక బొగ్గు గనులతో పాటు ఆస్ట్రేలియాలోని క్వీన్స్ లాండ్ లో ' కార్మైకేల్ " బొగ్గు గని, ఇండోనేసియాలో రెండు బొగ్గు గనుల్లో 74% వాటా అదానీ ఎంటర్ ప్రైజెస్ కలిగి ఉంది. అదానీకి చెందిన ఇండోనేసియా గనుల నుంచే భారత్ ఎక్కువగా బొగ్గును దిగుమతి చేసుకుంటున్నది.అదానీ బహుళజాతి ఎంటర్ ప్రైజెస్ సంస్థ బొగ్గు గనుల కోసం అనుసరిస్తున్న అక్రమ మార్గాలను, మోసాలను, అది సృష్టిస్తున్న అడవుల, పర్యావరణ వినాశనాన్ని, గిరిజనుల జీవితాలను కల్లోల భరితం చేయటాన్ని వ్యతిరేకిస్తూ, అదానీకి మోదీ ఇస్తున్న సహకారం విరమించాలని, దేశ ప్రజలు ఉద్యమించాలి.

రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
సెల్: 9885983526

మహాజన్‌కోతో ఒప్పందం

దేశంలోని గారే పాల్మా సెక్టార్ 2 బొగ్గు గని కోసం పవర్ జనరేషన్ కంపెనీతో అదాని ఎంటర్ ప్రైజెస్ కొత్త బొగ్గు గనుల ఒప్పందం చేసుకుంది. గారే పాల్మా సెక్టార్ 2 బొగ్గు గనిని భారత బొగ్గు మంత్రిత్వ శాఖ 2015లో మహారాష్ట్ర జన్‌కోకి కేటాయించింది. 2016లో ఈ బొగ్గు గని కోసం, గని డెవలపర్ కోసం బొగ్గు శాఖ టెండర్ ప్రకటించింది. రివర్స్ టెండర్ ద్వారా అదాని ఎంటర్ ప్రైజెస్ గనిని దక్కించుకుంది. దీని కాంట్రాక్ట్ 34 సంవత్సరాలు. ఈ గని నుంచి సంవత్సరానికి 23.6 మిలియన్ మెట్రిక్ టన్నుల గరిష్ఠంగా బొగ్గును తీసే సామర్థ్యం కలిగి ఉంది. ఈ గని అదాని గ్రూపు పరం కావటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ సహకరించాయి. ప్రభుత్వాల సహకారంతో ప్రభుత్వ రంగ బొగ్గు గనులను అదానీ గ్రూపు స్వాధీనం చేసుకుంటున్నది.

రాణావత్ వ్యాఖ్యలపై హర్యానాలో ఆప్ నిరసనలు

చండీగఢ్: నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన రైతులనుద్దేశించి బీజేపీ ఎంపీ కంగనా రాణావత్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఆమ్‌ఆద్మీ పార్టీ తప్పుబట్టింది. ఆమె వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఆ పార్టీ మంగళవారం హర్యానాలో నిరసనలు చేపట్టింది. జింద్, యమునానగర్, పంచకుల సహా వివిధ ప్రాంతాల్లో ఆప్ నేతలు, కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. ఆప్ హర్యానా విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అనురాగ్ దండా నేతృత్వంలో యమునానగర్ జిల్లాలో నిరసన ప్రదర్శన జరిగింది. ప్లకార్డులు చేతబట్టి బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా, ఆప్ హర్యానా అధ్యక్షుడు సుశీల్ గుప్తా రాణావత్ వ్యాఖ్యలను 'సిగ్గుచేటు' అని పేర్కొన్నారు. నల్ల వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకోవాలని ఉద్యమించినందుకే బీజేపీ రైతులను ద్వేషిస్తోందన్నారు. రాణావత్ ఇంతకు ముందు కూడా రైతులపై ఇలాంటి ప్రకటనలు చేశారని, అటువంటి వారికి పదవులు కట్టబెట్టడం బీజేపీ మనస్తత్వమని దుయ్యబట్టారు. రాణావత్ వ్యాఖ్యలు రైతుల పట్ల బీజేపీ వైఖరిని ప్రతిబింబిస్తున్నాయని ఆయన ఆరోపించారు. రాణావత్‌పై క్రిమినల్ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు.

కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ పాలసీకి సంబంధించి సీబీఐ నమోదు చేసిన కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎలాంటి ఊరట దక్కలేదు. కేజ్రీవాల్ జ్యుడిషియల్ కస్టడీని సెప్టెంబర్ 3న తేదీ వరకూ రౌస్ ఎవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా మంగళవారం పొడిగించారు. ఇంతకుముందు విధించిన కస్టడీ గడువు నేటితో ముగియడంతో కేజ్రీవాల్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు హాజరు పరిచారు. సీబీఐ దాఖలు చేసిన నాల్గవ ఛార్జిషీటుపై నిర్ణయాన్ని రౌస్ ఎవెన్యూ కోర్టు రిజర్వ్ చేసింది. ఈ ఛార్జిషీటులో కేజ్రీవాల్, మరో ఐదుగురి పేర్లను సీబీఐ చేర్చింది. సెప్టెంబర్ 3న దీనిపై కోర్టు విచారణ జరపనుంది. సీబీఐ, ఈడీ దర్యాప్తు చేస్తున్న ఎక్సైజ్ పాలసీ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఆప్ అధినేత కేజ్రీవాల్ ఢిల్లీలోని తీహార్ జైలులో ఉన్నారు.

'అమ్మ'కు మోహన్‌లాల్ రాజీనామా

తిరువనంతపురం: మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళల స్థితిగతులపై జస్టిస్ హేమ కమిటీ సమర్పించిన నివేదికలో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగు చూశాయి. ఆ చిత్రసీమలో పనిచేసే మహిళలు క్యాస్టింగ్ కౌచ్, లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారని ఆ నివేదిక పేర్కొంది. దీనిపై తీవ్ర దుమారం కొనసాగుతున్న వేళ ప్రముఖ నటుడు మోహన్‌లాల్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ (అమ్మ) అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆయనతో పాటు 17 మంది సభ్యులున్న మొత్తం పాలకమండలి పదవుల నుంచి వైదొలిగింది.

కుండపోత వర్షం

- వణుకుతున్న ఉత్తరాది రాష్ట్రాలు
- ప్రమాదస్థాయి మించి ప్రవహిస్తున్న నదులు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- జనజీవనం అస్తవ్యస్తం

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్, రాజస్థాన్‌ల్లో విస్తరించిన తీవ్ర అల్పపీడనం కారణంగా దేశంలో అనేక రాష్ట్రాల్లో భారీ వర్షాలు దంచికొడుతున్నాయి. గుజరాత్ నుంచి త్రిపుర వరకూ, బెంగాల్ నుంచి మహారాష్ట్ర వరకూ భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఈ నెల 30 వరకూ భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఢిల్లీలో ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను వాయుగుండంగా మారడంతో బెంగాల్‌లో అనేక జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. త్రిపురలో భారీ వర్షాలకు వారం రోజుల్లో 26 మంది మరణించారు. సుమారు 1.17 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. మౌలిక సదుపాయాలు, ఆస్తులు, పంటలకు రాష్ట్రంలో దాదాపు 15 వేల కోట్ల రూపాయిల నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేస్తున్నారు. మహారాష్ట్రలో భారీ వర్షాలకు గోదావరి నది పొంగిపొర్లుతోంది.

ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌ను భారీ వర్షాలు వణికిస్తున్నాయి. రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. మూడోరోజైన మంగళవారం కుండపోత వర్షం కురిసింది. దీంతో రాష్ట్రం మొత్తం అస్తవ్యస్తమైంది. లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వర్షపు నీరు చేరడంతో జనజీవనం స్తంభించిపోయింది. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ఈ వర్షాలకు ప్రధాన డ్యామ్‌లు, నదుల్లో నీటి మట్టాలు పెరిగాయి. చాలా నదులు ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. పంచమహల్, నవ్‌సారి, వల్సాడ్, వడోదర, భరూచ్, ఖేడా, గాంధీనగర్, బోటాడ్, ఆరావళి జిల్లాల్లో నదులు, డ్యామ్‌ల్లో నీటి మట్టం భారీగా పెరిగి లోతట్టు ప్రాంతాలను వరద ముంచెత్తింది. దీంతో ముందుజాగ్రత్త చర్యగా వందలాది మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇప్పటి వరకూ ఆరు వేల మందికిపైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. పంచమహల్‌లో దాదాపు 2,000 మందిని తరలించగా, వడోదరలో 1,000, నవ్‌సారిలో 1,200 మంది, వల్సాద్‌లో 800 మందిని ఇతర ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏడుగురు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. గాంధీనగర్, ఖేడా, వడోదర జిల్లాల్లో గోడ కూలిన ఘటనల్లో నలుగురు మృతి చెందగా.. ఆనంద్ జిల్లాలో చెట్టు కూలి ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరు వరద నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు.

నర్మదా నదికి 4 లక్షల క్యూసెక్కుల నీరు

గుజరాత్‌లో సర్దార్ సరోవర్ డ్యామ్ నుంచి నర్మదా నదిలోకి దాదాపు 4 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భరూచ్ నగరంలోని లోతట్టు ప్రాంతాల నుంచి 280 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహం కారణంగా సర్దార్ సరోవర్ నీటి నిల్వ సోమవారానికి 135.20 మీటర్లకు చేరుకుంది. డ్యామ్ పూర్తి సామర్థ్యానం (138.68 మీటర్లు) కంటే కేవలం 3.48 మీటర్లు తక్కువ. డ్యామ్‌కు రోజుకు 3.68 క్యూసెక్కుల నీరు చేరుతుందని అధికారులు తెలిపారు. నది పరివాహక ప్రాంతాల్లో ప్రజలు నదీ ఒడ్డుకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు.

ఎన్నికల్లో ఓటమికి నిరాశ లేదు

బీఎస్‌పీ అధ్యక్షురాలిగా మాయావతి ఏకగ్రీవం

లక్నో: బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్‌పీ) జాతీయ అధ్యక్షురాలిగా మాయావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలలో ప్రతికూల పరిణామాలు ఎదురైనప్పటికీ పార్టీ నిరాశ చెందలేదని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నట్లు పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. మంగళవారం ఇక్కడ బీఎస్‌పీ కేంద్ర కార్యవర్గ కమిటీ (సీఈసీ), జాతీయ స్థాయి, రాష్ట్ర పార్టీ యూనిట్లలోని సీనియర్ ఆఫీస్ బేరర్లు, దేశం నలుమూలల నుంచి వచ్చిన ప్రతినిధుల ప్రత్యేక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అది తెలిపింది. 68 ఏళ్ల మాయావతి ఉత్తర ప్రదేశ్‌కు నాలుగుసార్లు మాజీ ముఖ్యమంత్రిగా పని చేశారు. బీఎస్‌పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ ఆమెను తన రాజకీయ వారసురాలిగా రెండు దశాబ్దాల క్రితమే ప్రకటించారు. ఆమె 2003లో తొలిసారిగా పార్టీ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి ఆ పదవిలో ఆమె కొనసాగుతూనే ఉన్నారు. బీఎస్‌పీ ఉద్యమం ద్వారా దళితులు, ఆదివాసీలు, ఓబీసీ సమాజాలలో జన్మించిన 'గొప్ప వ్యక్తుల' మానవతా మిషన్‌ను ముందుకు తీసుకెళ్లడానికి ఎలాంటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నానని ఆమె పార్టీ అనుచరులకు హామీ ఇచ్చినట్లు ప్రకటన పేర్కొంది. రెండు రోజుల క్రితం, మాయావతి క్రియాశీల రాజకీయాల నుంచి రిటైర్మెంట్ ప్రశ్నే లేదంటూ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. మంగళవారం ఇక్కడ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాయావతి మాట్లాడుతూ బహుజనుల ఆత్మగౌరవం, గౌరవం కోసం డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ చేసిన ఉద్యమం ఇప్పుడు ముందుకు సాగుతోందని, దాని లక్ష్యం నుంచి తప్పుదారి పట్టించలేని విధంగా బలంగా మారిందని తెలిపారు. 'అంతేకాకుండా, ఎన్నికలలో ప్రతికూల పరిణామాలు ఎదురైనప్పటికీ బీఎస్‌పీ నిరాశ చెందలేదు. దోపిడీకి గురవుతున్న, పీడిత, పేద ప్రజలందరి బహుజన సమాజం బలంతో 'బహుజన హితయే, బహుజన సుఖాయే' (బహుజనుల పురోగతి, శ్రేయస్సు) లక్ష్యం, సంక్షేమ సూత్రాన్ని అది దృఢంగా కొనసాగిస్తోంది' అని తెలిపారు. రెండు జాతీయ పార్టీలు దేశంలోని మైనారిటీలు, వెనుకబడిన వర్గాల నిజమైన శ్రేయోభిలాషులు కాదని ఆమె కాంగ్రెస్, బీజేపీపై మండిపడ్డారు. 'దేశంలో ఎక్కువ కాలం అధికారంలో ఉన్న ఈ రెండు పార్టీలు, వారి కూటమిల పాలనలో బహుజనుల పరిస్థితిలో మెరుగుదల లేదు. సమాజంలో అన్ని రకాల అసమానతలు పెరుగుతూ వచ్చాయి' అని తెలిపారు.

బీజేపీ ఓటమి కోసం కాంగ్రెస్‌తో జట్టు

ఎన్‌సీ నేతలు అబ్దుల్లా, ఒమర్

శ్రీనగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఓడించే లక్ష్యంతో ఒక సంఘటిత కూటమిగా కాంగ్రెస్‌తో సీట్ల పంపకం జరిగిందని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) నేతలు ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా మంగళవారం తెలిపారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు నేషనల్ కాన్ఫరెన్స్ 51, కాంగ్రెస్ 32 సీట్లలో పోటీ చేసేందుకు అంగీకారం కుదిరిన ఒక రోజు తర్వాత వారు ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్‌సీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా మాట్లాడుతూ ఒక సంకీర్ణంలో నియోజకవర్గాల్లో ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. పుల్వామా జిల్లాలోని అవంతిపోరా ప్రాంతంలో విలేకరులతో మాట్లాడుతూ 'సంకీర్ణంలో ఒకరు అనేక విషయాలను భరించాలి. మీరు కొన్ని సీట్లు పొందేందుకు కొన్ని సీట్లు వదిలివేయాలి. సంకీర్ణం తీసుకున్న తుది నిర్ణయం చాలా మంచిదని మేము నమ్ముతున్నాం. సంకీర్ణం విజయం సాధిస్తుంది. ఇక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. ఇది ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నిస్తుంది' అని తెలిపారు. పాంపోర్ సీటు కోసం నేషనల్ కాన్ఫరెన్స్ అభ్యర్థి, మాజీ లోక్‌సభ సభ్యుడు విశ్రాంత న్యాయమూర్తి హస్నైన్ మసూది నామినేషన్ పత్రాలను దాఖలు చేయడానికి ఇక్కడకు వచ్చిన సీనియర్ అబ్దుల్లా... 'మా లక్ష్యాలు మంచివి అయితే, మేము విజయం సాధిస్తాం' అని అన్నారు. అనంతనాగ్ జిల్లాలోని బిజ్‌బెహరా వద్ద ఒమర్ అబ్దుల్లా విలేకరులతో మాట్లాడుతూ 'కాంగ్రెస్‌తో సీట్ల పంపకాల ఒప్పందం కుదిరింది. బీజేపీ, దాని మద్దతు ఇచ్చే పార్టీలకు వ్యతిరేకంగా సంఘటిత ఫ్రంట్‌ని లేవనెత్తడం, వాటికి వ్యతిరేకంగా ఎన్నికలలో పోటీ చేయడం, విజయావకాశాలను మరింత పెంచుకోవడం ఈ ప్రయత్నం' అని తెలిపారు. సీట్ల పంపకాల ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ, గత ఐదు నుంచి 10 సంవత్సరాలుగా కష్టపడి ఎన్నికల్లో పోటీ చేయాలని కోరుకున్న కొంతమంది నాయకులకు ఆదేశం ఇవ్వలేదని తనకు తెలుసునని ఒమర్ అన్నారు. 'ఐదు-పదేళ్లు కష్టపడి పనిచేసిన మా స్నేహితులు చాలా మంది ఉన్నారు. వారు ఎన్‌సీ టికెట్‌పై ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్నారని నేను గ్రహించాను. కానీ వారిలో కొందరిని ఈ సీటు పంపకంలో వదిలివేశాం. అయితే భవిష్యత్‌లో వారికి పరిహారం ఇవ్వాలని కోరుతున్నాం. పార్టీకే కాకుండా ప్రజలకు కూడా సేవ చేసే అవకాశం వారికి రావాలి' అని మాజీ ముఖ్యమంత్రి అన్నారు. బిజ్‌బెహరా అసెంబ్లీ నియోజకవర్గానికి నేషనల్ కాన్ఫరెన్స్ అభ్యర్థి బషీర్ అహ్మద్ వీరీ నామినేషన్ పత్రాల దాఖలుకు ఒమర్‌తో కలిసి వచ్చారు. జమ్మూకశ్మీర్‌లో తొలి దశ ఎన్నికలకు నామినేషన్ల దాఖలుకు గడువు మంగళవారంతో ముగిసింది. 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత తొలిసారిగా జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. మూడు దశల్లో మొదటి దశ పోలింగ్ సెప్టెంబరు 18న, ఆ తర్వాత 25న, చివరి దశ అక్టోబరు 1న జరుగుతుంది. అక్టోబరు 4న ఓట్ల లెక్కింపు జరగనుంది.

ఒకేచోట భారత్, చైనా యుద్ధ నౌకలు

శ్రీలంక తీరంలో అనూహ్య పరిణామం

న్యూఢిల్లీ: ఓ వైపు లడ్డాక్ సరిహద్దులో సైనిక ప్రతిష్టంభన... మరోవైపు హిందూ మహాసముద్రంలో పట్టు కోసం ప్రయత్నాలు... ఇలా అనేక అంశాల్లో కొంతకాలంగా భారత్, చైనా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాల వేళ అనూహ్య సంఘటన చోటుచేసుకుంది. శ్రీలంక తీరంలో రెండు దేశాల యుద్ధ నౌకలు పక్కపక్కనే లంగరేశాయి. క్షిపణి విధ్వంసక భారత యుద్ధ నౌక 'ఐఎన్‌ఎస్ ముంబయి సోమవారం అధికారిక పర్యటన నిమిత్తం కొలంబో తీరానికి చేరుకుంది. అదే సమయంలో చైనాకు చెందిన మూడు యుద్ధ నౌకలు 'హీ ఫీ', 'వుజిషాన్', 'క్విలియాన్‌షాన్' కూడా ఇదే పోర్టుకు అధికారిక పర్యటనకు వచ్చాయని శ్రీలంక నేవీ ఓ ప్రకటనలో వెల్లడించింది. మూడు రోజుల పర్యటన నిమిత్తం 'ఐఎన్‌ఎస్ ముంబయి' శ్రీలంక తీరానికి వెళ్లింది. 163 మీటర్ల పొడవైన ఈ డెస్ట్రాయర్‌లో 410 మంది సిబ్బంది ఉన్నారు. ఈ నౌకకు శ్రీలంక నేవీ సాదర స్వాగతం పలికింది. స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఈ నౌకను 2001లో భారత నేవీలోకి తీసుకున్నారు. ఈ నౌక శ్రీలంక పోర్ట్‌కు వెళ్లడం ఇదే తొలిసారి. శ్రీలంక నౌకాదళంతో కలిసి ఇది చాలా కార్యక్రమాల్లో పాల్గొననుంది. ఇక, 'ఐఎన్‌ఎస్ ముంబయి' కొలంబో తీరంలో ఉన్న సమయంలోనే చైనా యుద్ధనౌకలు కూడా అక్కడకు చేరుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. 'హీ ఫీ' యుద్ధ నౌకలో 267 మంది, 'వుజిషాన్'లో 872 మంది, 'క్విలియాన్‌షాన్'లో 334 మంది చైనా సిబ్బంది ఉన్నారు. ఇవి హిందూ మహా సముద్రంలోకి ప్రవేశించినప్పటి నుంచి వీటి కదలికలను భారత నేవీ ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

సుప్రీంకోర్టుకు 18 రాష్ట్రాలు, యూటీల సీఎస్‌లు

న్యూఢిల్లీ: ఒక కేసుకు సంబంధించిన విచారణలో భాగంగా 18 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్య కార్యదర్శులు (సీఎస్‌లు) సుప్రీంకోర్టు ఎదుట హాజరయ్యారు. పదవీ విరమణ పొందిన జ్యుడీషియల్ అధికారులకు రెండో నేషనల్ జ్యుడీషియల్ పే కమిషన్ (ఎస్ఎన్ జేపీసీ) సిఫార్సుల మేరకు పింఛను బకాయిలు, ఇతర ప్రయోజనాలు కల్పించడంలో రాష్ట్రాలు అలసత్వం వహించడమే అందుకు కారణం. ఈ క్రమంలో మధ్యప్రదేశ్, తమిళనాడు, మేఘాలయ, హిమాచల్ ప్రదేశ్, బంగాల్, బీహార్, ఒడిశా, కేరళ, ఢిల్లీ సహా కేంద్రపాలిత ప్రాంతాలు ఎస్ఎన్‌జేపీసీ సిఫార్సుల అమలుకు సమ్మతిస్తున్నట్లు సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశాయి. ఈ అఫిడవిట్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. ఈ కేసులో అఫిడవిట్ సమర్పించిన రాష్ట్రాలపై విచారణను నిలిపివేయాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించిన రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, ఆర్థిక కార్యదర్శులు ఇకపై కోర్టుకు హాజరు కావాల్సిన అవసరం లేదని పేర్కొంది. "రాష్ట్రాల ప్రధాన, ఆర్థిక కార్యదర్శులను కోర్టుకు పిలవడంలో మాకు ఎలాంటి ఆనందం లేదు. కానీ విచారణ సమయంలో రాష్ట్రాల తరపున న్యాయవాదులు నిరంతరం గైర్హాజరవుతున్నారు" అని ధర్మాసనం పేర్కొంది. అసలేం జరిగిందంటే... అనేక ఆదేశాలు ఇచ్చినప్పటికీ, సమయం పొడిగించినప్పటికీ 18 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు రెండో నేషనల్ జ్యుడీషియల్ పే కమిషన్ సిఫార్సులను పూర్తిగా పాటించలేదని కోర్టు సహాయకునిగా (అమికస్ క్యూరీ) వ్యవహరిస్తున్న న్యాయవాది కె.పరమేశ్వర్ సుప్రీంకోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో పదవీ విరమణ పొందిన జ్యుడీషియల్ అధికారులకు ఎస్ఎన్ జేపీసీ సిఫార్సులు అమలు చేయని దేశంలోని 18 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సుప్రీంకోర్టు కొన్నాళ్ల క్రితం సమన్లు జారీ చేసింది. సమన్లు అందుకున్న రాష్ట్రాల్లో తమిళనాడు, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, బెంగాల్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, అసోం, నాగాలాండ్, మేఘాలయ, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, లద్దాక్, జార్ఖండ్, కేరళ, బీహార్, గోవా, హర్యానా, ఒడిశా సహా కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి. దీంతో ఆయా సీఎస్‌లు సుప్రీంకోర్టులో హాజరుకావాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో మంగళవారం 18 రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల సీఎస్‌లు సుప్రీం ఎదుట హాజరయ్యారు.

మహారాష్ట్రలో మరో దారుణం నర్సింగ్ విద్యార్థినిపై ఆటో డ్రైవర్ అత్యాచారం

ముంబై: కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచారం ఘటన యావత్ దేశాన్ని కుదిపివేస్తున్నప్పటికీ మహిళలపై అరాచకాలు ఆగట్లేదు. తాజాగా మహారాష్ట్రలో మరో ఘటన చోటుచేసుకుంది. నర్సింగ్ విద్యార్థినిపై ఓ ఆటోడ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని రత్నగిరిలో నర్సింగ్ విద్యార్థిని(20) తరగతులకు హాజరైన అనంతరం ఇంటికి వెళ్లడానికి ఆటో ఎక్కింది. ఆమెతో మాటలు కలిపిన డ్రైవర్ తాగడానికి నీళ్లు ఇచ్చాడు. అప్పటికే అందులో అతడు మత్తుమందు కలపడంతో యువతి స్పృహ కోల్పోయింది. అనంతరం ఆమెను నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లిన అత్యాచారానికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలతో, అపస్మారక స్థితిలో ఉన్న బాధితురాలిని గమనించిన స్థానికులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. కొంత సేపటికి స్పృహ రావడంతో తనపై లైంగిక దాడి జరిగినట్లుగా గుర్తించిన బాధితురాలు ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలిపింది. వారు పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

30న బీజేపీ గూటికి చంపై సోరెన్

న్యూఢిల్లీ: తాను బీజేపీలో చేరబోతున్నట్లు జార్ఖండ్ మాజీ సీఎం చంపై సోరెన్ స్వయంగా వెల్లడించారు. మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. 'తొలుత క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకొందామని అనుకున్నా. ఈ నెల 18న ఢిల్లీ వచ్చినప్పుడే నా వైఖరిని స్పష్టంగా చెప్పాను. పూర్తిగా రాజకీయాల నుంచి తప్పుకోవాలని భావించా. కానీ, నాకు ప్రజల మద్దతు ఉంది. అందుకే బీజేపీలో చేరాలని నిర్ణయిం తీసుకున్నా' అని చంపై స్పష్టం చేశారు. కాగా, చంపై సోరెన్ ఆగస్టు 30న బీజేపీలో అధికారికంగా చేరనున్నారని అసోం ముఖ్యమంత్రి హిమంత విశ్వ శర్మ వెల్లడించిన విషయం తెలిసిందే. చంపై కేంద్రమంత్రి అమిత్ షాతో సమావేశం అయ్యాక పార్టీలో చేరిక విషయంలో నిర్ణయం తీసుకున్నారని హిమంత తెలిపారు. జార్ఖండ్‌లో మరికొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. చంపై సోరెన్ ఆగస్టు 30న రాంచీలో అధికారికంగా బీజేపీలో చేరనున్నట్లు హిమంత విశ్వ శర్మ తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా తెలిపారు. చంపై సోరెన్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారని తన పోస్ట్‌లో తెలిపారు. చంపై సోరెన్ సోమవారం న్యూఢిల్లీ చేరుకుని బీజేపీ సీనియర్ నేతలతో భేటీ అయ్యారు. అంతకుముందు ఢిల్లీ వెళ్లిన చంపై సోషల్ మీడియాలో పోస్ట్ ద్వారా పార్టీ నాయకత్వం తనను అవమానించిందని ఆరోపించారు. నిరంతర అవమానకర ప్రవర్తన కారణంగా ఉద్వేగానికి లోనై రాజకీయాల్లో కొత్త ఎంపికను అనుసరించాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. అవమానం, తిరస్కరణ కారణంగా, తాను ప్రత్యామ్నాయ మార్గం కోసం వెతకవలసి వచ్చిందన్నారు. ఈరోజు నుంచి తన జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుందని వెల్లడించారు. మనీలాండరింగ్ కేసులో హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేసిన తర్వాత చంపై సోరెన్‌ను జార్ఖండ్ సీఎంగా చేశారు. ఫిబ్రవరి నుంచి జులై వరకు సీఎంగా పనిచేశారు. 2005 నుంచి జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ఆయన అసెంబ్లీకి ఎన్నికయ్యారు. హేమంత్ జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత సీఎం పదవికి చంపై రాజీనామా చేశారు.

మీడియాపై సురేశ్ గోపి అసహనం

తిరువనంతపురం: మలయాళం ఫిల్మ్ ఇండస్ట్రీలో లైంగిక వేధింపులు ఉన్నట్లు ఇటీవల హేమ కమిషన్ ఇచ్చిన నివేదికపై కేంద్ర మంత్రి సురేశ్ గోపి స్పందించారు. మలయాళం ఫిల్మ్ ఇండస్ట్రీపై మీ ఆరోపణలు ఉన్నాయని మంత్రిని అడగ్గా... దానికి ఆయన బదులిస్తూ కోర్టే సమాధానం ఇస్తుందన్నారు. చిత్ర పరిశ్రమలో ఆరోపణలు మీడియాకు ఆహారంగా మారిందని, మీరు ఆ వార్తలతో డబ్బులు సంపాదించవచ్చు అని, కానీ ఓ పెద్ద వ్యవస్థను నేలకూలుస్తున్నారని, మేకలు కొట్టుకునేలా చేసి, ఆ తర్వాత మీలాంటి వాళ్లు వాటి రక్తాన్ని తాగుతారని, ప్రజల మెదళ్లను మీడియా తప్పుదోవ పట్టిస్తోందని సురేశ్ గోపి ఆరోపించారు. తాను ప్రైవేట్ విజిట్‌లో ఉన్నానని, మలయాళం మూవీ ఆర్టిస్టుల సంఘానికి చెందిన ప్రశ్నలు కేవలం ఆ ఆఫీసును విజిట్ చేసినప్పుడు మాత్రమే అడగాలని ఆయన పేర్కొన్నారు.

కశ్మీరీ వలస ఓటర్ల కోసం సహాయ కేంద్రం

జమ్మూ: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు సన్నాహాలు ఊపందుకుంటున్నందున, దేశవ్యాప్తంగా నివసిస్తున్న స్థానభ్రంశం చెందిన కశ్మీరీ సమాజానికి చెందిన అర్హులైన ఓటర్లకు సహాయం చేయడానికి సహాయ, పునరావాస విభాగం హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ప్రత్యేక పోలింగ్ కేంద్రాల్లో, పోస్టల్ బ్యాలెట్ల ద్వారా సజావుగా పోలింగ్‌ను సులభతరం చేయడం ఈ చొరవ లక్ష్యం. జమ్మూ, ఉదంపూర్, ఢిల్లీలో స్థానభ్రంశం చెందిన కశ్మీరీ సమాజ ఓటర్ల కోసం ఎన్నికల సంఘం (ఈసీ) 24 ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు, పోస్టల్ బ్యాలెట్ పథకాన్ని ఏర్పాటు చేయడంతో కశ్మీరీ వలసదారులకు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా ఈ విభాగం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. 'మా కార్యాలయంలో, వివిధ మండలాల్లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటయ్యాయి. వలస ఓటర్లకు పోలింగ్‌ను సజావుగా నిర్వహించేందుకు అనేక మంది ఉద్యోగులను నియమించడం జరిగింది' అని సహాయ, పునరావాస కమిషనర్ డాక్టర్ అరవింద్ కర్వానీ తెలిపారు. సెప్టెంబరు 18 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటరు సౌకర్యాలను పెంపొందించే లక్ష్యంతో, వలసదారులు ఎదుర్కొంటున్న సమస్యలను హెల్ప్‌డెస్క్ చురుకుగా పరిష్కరిస్తోందని కర్వానీ ఉద్ఘాటించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) ద్వారా వ్యక్తిగతంగా ఓటు వేసేందుకు ఎంపిక చేసుకునే కశ్మీరీ వలస ఓటర్లు జమ్మూలో 19, ఉదంపూర్‌లో 1, ఢిల్లీలో 4 కేంద్రాలతో సహా 24 పోలింగ్ కేంద్రాలను కలిగి ఉంటారని ఆయన చెప్పారు. హెల్ప్‌డెస్క్ కోసం కంట్రోల్ రూమ్‌ను పర్యవేక్షిస్తున్న కర్వానీ, ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ పోలింగ్ కేంద్రాలలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కశ్మీరీ వలసదారుల కోసం ఓటింగ్ ఎంపికలను వివరిస్తూ ఎన్నికల సంఘం ఆగస్టు 22న నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రత్యేక పోలింగ్ కేంద్రాలలో, పోస్టల్ బ్యాలెట్‌ల ద్వారా వ్యక్తిగతంగా ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తుంది. 'ఉదంపూర్, ఢిల్లీ, జమ్మూలలో ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రత్యామ్నాయంగా కశ్మీరీ వలసదారులు పోస్టల్ బ్యాలెట్లను ఎంచుకోవచ్చు' అని అన్నారు. జమ్మూ, ఉదంపూర్‌లోని వివిధ జోన్లలోని వలస ఓటర్ల వివరాలను సంబంధిత ప్రత్యేక పోలింగ్ కేంద్రాలకు మ్యాప్ చేసి, నవీకరించబడిన ఓటర్ల జాబితాలను త్వరలో ప్రచురించనున్నట్లు కర్వానీ తెలిపారు. 'దిద్దుబాట్లు లేదా అభ్యంతరాలు ఏడు రోజుల వ్యవధిలో ఆమోదించబడతాయి' అని ఆయన అన్నారు. జమ్మూకశ్మీర్‌లోని 90 అసెంబ్లీ నియోజకవర్గాలకు మూడు దశల్లో సెప్టెంబరు 18 నుంచి ఎన్నికలు జరగనుండగా, అక్టోబరు 4న ఓట్ల లెక్కింపు జరగనుంది.

టెలిగ్రాం సీఈవో అరెస్ట్‌తో ఐటీశాఖ అప్రమత్తం

న్యూఢిల్లీ: మెసేజింగ్ యాప్ టెలిగ్రాం సీఈవో పావెల్ దురోవ్‌ను ఫ్రాన్స్‌లో అదుపులోకి తీసుకోవడంతో ఐటీ మంత్రిత్వ శాఖ అప్రమత్తమైంది. భారత్‌లో టెలిగ్రాం యాప్ నిబంధనల ఉల్లంఘనలకు ఏమైనా పాల్పడిందా అనే కోణంలో దర్యాప్తు చేపట్టాలని హోంమంత్రిత్వ శాఖను ఐటీ మంత్రిత్వ శాఖ కోరింది. టెలిగ్రాంపై ఏమైనా ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంటే భారత్‌లోనూ ఆ యాప్‌పై తగిన చర్యలు చేపట్టేందుకు ఐటీ మంత్రిత్వ శాఖ సన్నద్ధమైంది. టెలిగ్రాంపై పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను పరిశీలించాలని, యాప్‌పై ఎలాంటి చర్యలు చేపట్టవచ్చని హోంమంత్రిత్వ శాఖను ఐటీ మంత్రిత్వ శాఖ కోరిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. దోపిడీ, గ్యాంబ్లింగ్ వంటి కార్యకలాపాలకు టెలిగ్రాం యాప్ ప్లాట్‌ఫాం దుర్వినియోగంపై భారత ప్రభుత్వం నిర్దిష్టంగా టెలిగ్రాంపై విచారణ చేపట్టాలని యోచిస్తోందని మరో వార్తా కథనం వెల్లడించింది. కాగా, మెసేజింగ్ యాప్ టెలిగ్రాం సీఈవో పవెల్ దురోవ్‌ను ఫ్రాన్స్‌లోని లీ బగెట్ ఎయిర్‌పోర్ట్‌లో తన ప్రైవేట్ జెట్ నుంచి దిగిన వెంటనే అరెస్ట్ చేశారు.

పుతిన్‌తో మోదీ కీలక చర్చలు

ఉక్రెయిన్ పర్యటనపై అభిప్రాయాలు పంచుకున్న నేతలు



న్యూఢిల్లీ: భారత్‌కు మిత్ర దేశమైన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం మాట్లాడారు. రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాలతో పాటు ఇటీవల ముగిసిన మోదీ ఉక్రెయిన్ పర్యటనపై కూడా చర్చించారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా ప్రకటించారు. 'పుతిన్‌తో ఈ రోజు మాట్లాడాను. రెండు దేశాల మధ్య ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడుకున్నాం. రష్యా-ఉక్రెయిన్ వివాదంతో పాటు ఇటీవలే నేను ఉక్రెయిన్‌లో పర్యటించడంతో నా ఆలోచనలను కూడా పంచుకున్నాను. ఈ వివాదాన్ని శాంతియుత, వీలైనంత త్వరగా పరిష్కరించుకునేందుకు భారత్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని నేను పునరుద్ఘాటించాను' అని మోదీ వివరించారు. పుతిన్‌తో మోదీ చర్చపై కేంద్ర ప్రభుత్వం కూడా ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేసింది. భారత్-రష్యా మధ్య 22వ ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు గత నెలలో ముగిసిన తన రష్యా పర్యటనను మోదీ గుర్తు చేసుకున్నారని తెలిపింది. ఇద్దరు నేతలు ద్వైపాక్షిక అంశాల్లో పురోగతిని సమీక్షించారని వివరించింది. భారత్, రష్యా మధ్య ప్రత్యేకమైన, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడుకున్నారని వివరించింది. పరస్పర ప్రయోజనకరమైన ప్రాంతీయ, అంతర్జాతీయ సవాళ్లపై అభిప్రాయాలను పంచుకున్నారని ప్రకటనలో కేంద్రం పేర్కొంది. ఎడతెగకుండా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ వివాదంపై ఇద్దరు నాయకులు అభిప్రాయాలు పంచుకున్నారని కేంద్రం వెల్లడించింది. మోదీ ఇటీవల తన ఉక్రెయిన్ పర్యటనకు సంబంధించిన తన ఆలోచనలను పుతిన్‌తో పంచుకున్నారు. సంబంధిత భాగస్వాములు అందరూ శాంతికి కట్టుబడి ఆచరణాత్మక చర్చలు జరపాలని మోదీ సూచించారు.

రెండు ట్రిలియన్ డాలర్లు లక్ష్యం

- డిజిటల్ పాలన... ఆర్థికాభివృద్ధికి నమూనాగా రాష్ట్రం
- వికసిత్ ఏపీ-2047పై విజన్ డాక్యుమెంట్ తయారీ
- నీతి ఆయోగ్ ప్రతినిధుల భేటీలో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికల్లా రెండు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ దిశగా ఏపీ వికసిత్ -2047 విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. సీఎం చంద్రబాబుతో మంగళవారం సచివాలయంలో నీతిఆయోగ్ ప్రతినిధులు భేటీ అయ్యారు. వికసిత్ ఏపీ -2047 రూపకల్పనపై చర్చించారు. రాబోయే రెండు దశాబ్దాల కాలంలో తమ విజన్ ఏ విధంగా ఉండబోతుందో చంద్రబాబు వివరించారు. వచ్చే ఐదేళ్లకు జిల్లాల వారీగా విజన్ డాక్యుమెంట్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఏపీని అత్యున్నత విలువైన వ్యవసాయ ప్రాసెసింగ్ కేంద్రంగా రూపొందించడంతోపాటు పారిశ్రామికంగా యువతలో నైపుణ్యం పెంచేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. భారతదేశ తూర్పుతీరానికి ఏపీని లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. పరిశ్రమలు, పునరుత్పాదక విద్యుదుత్పత్తి కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చి దిద్దేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఏపీని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని వివిధ నగరాలను అభివృద్ధి కేంద్రాలుగా మారుస్తామని, అందరికీ అత్యాధునిక వైద్యసేవలు అందేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పర్యావరణ అనుకూల అభివృద్ధిపై దృష్టిపెట్టేలా ప్రణాళికలను సీఎం వివరించారు. డిజిటల్ గవర్నెన్స్, ఆర్థికాభివృద్ధికి ఏపీని ఓ నమూనాగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పేదరిక నిర్మూలన, రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'విజన్ డాక్యుమెంట్ 2047'ను అక్టోబర్ 2న విడుదల చేయనున్నట్లు ఇప్పటికే చంద్రబాబు ప్రకటించగా, అదే విషయాన్ని నీతి ఆయోగ్ ప్రతినిధులకు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి కలెక్టర్ల సదస్సులో ఈ విషయాన్ని చంద్రబాబు ప్రస్తావిస్తూ... జిల్లా కలెక్టర్లు తమ జిల్లాలు, మండలా లకు సంబంధించిన 2047 విజన్ డాక్యుమెంట్లు తీసుకురావాలని ఆదేశించారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో భాగంగా విజన్ డాక్యుమెంటుపై నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్ బేరీతో ముఖ్యమంత్రి కొన్ని గంటల పాటు సుదీర్ఘంగా చర్చించారు. 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనపై నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యంతోనూ చంద్రబాబు సమావేశమయ్యారు. దీనిలో భాగంగా ఏపీ విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరచాల్సిన ముఖ్యమైన అంశాలను ఆయనకు చంద్రబాబు సూచించారు. పేదరికం లేని సమాజం, జనాభా సమతుల్యతపై కసరత్తు చేసి ప్రణాళికలు రూపొందిస్తామని చంద్రబాబు తెలిపారు. అన్ని రంగాల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అనుసధానం చేస్తామని వెల్లడించారు. ఏపీలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసే యోచన చేస్తున్నట్లు చెప్పారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ విజన్ డాక్యుమెంట్‌లో రాష్ట్రస్థాయి నుంచి కుటుంబ స్థాయి వరకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో కొత్త ఆవిష్కరణలు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నా మన్నారు. 15 శాతం వృద్ధిరేటు సాధించడమే ఆంధ్రప్రదేశ్ లక్ష్యమని, అనుకున్న విధంగా వృద్ధిరేటు సాధిస్తే తలసరి ఆదాయం కూడా పెరిగి ప్రజల ఆర్థిక స్థితిగతులు మారతాయని, తద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని సీఎం వివరించారు.

వియత్నాం పర్యటనలో భాగంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా నేతృత్వంలోని ప్రతినిధి బృందం... వియత్నాం కమ్యూనిస్టు పార్టీ (సీపీవీ) పొలిట్ బ్యూరో సభ్యుడు లౌంగ్ కౌంగ్, సీపీవీ సీనియర్ నాయకులను పార్టీ ప్రధాన కార్యాలయంలో కలిసింది. రెండు పార్టీల మధ్య పరస్పర సంబంధాలు, రెండు దేశాల్లో సామాజిక-సాంస్కృతిక, రాజకీయ సంబంధాలు, ఇతర అంతర్జాతీయ రాజకీయ పరిణామాల గురించి ప్రతినిధి బృందం చర్చించింది. రాజాతో పాటు ప్రతినిధి బృందంలో సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి, జాతీయ సమితి సభ్యులు ముత్తురామలింగం కన్నగి, కేరళకు చెందిన ఎమ్మెల్యే సీకే ఆషా ఉన్నారు.

నేడు విజయవాడలో భూ బాధితుల రాష్ట్ర సదస్సు

విశాలాంధ్ర-విజయవాడ: భూ అక్రమ లావాదేవీలను రద్దు చేయాలని, పేదల అక్రమణలో ఉన్న భూములకు, ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో బుధవారం విజయవాడలో భూ బాధితుల రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యాలయ ప్రతినిధి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సు ఉదయం 11 గంటలకు తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరుగుతుందని, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో పాటు పార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదలు, అసైన్డ్ భూముల బాధితులు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు వివరించారు.

జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు

తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురి ఎంపిక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారు. కేంద్ర విద్యాశాఖ తరపున జాయింట్ డైరెక్టర్ అనుజైన్ మంగళవారం 'జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు-2024' వివరాలను ప్రకటించారు. దేశ వ్యాప్తంగా 50 మందిని అవార్డులకు ఎంపిక చేశారు. ఏపీ నుంచి కృష్ణాజిల్లా గుడివాడ ఎస్‌పీఎస్ మున్సిపల్ హైస్కూల్ ప్లస్ స్కూల్ ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, తిరుపతిజిల్లా శ్రీకాళహస్తి మండల ఉర్లదూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సురేశ్ కూనాటికి జాతీయ అవార్డులు దక్కాయి. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా రూరల్ మండలంలోని తిరుమలాయపాలెం మండలం నుంచి పరసా ప్రభాకర్‌రెడ్డి, సిరిసిల్ల జిల్లా పరిషత్ ఉపాధ్యాయుడు తాడూరి సంపత్‌కుమార్‌ను ఎంపిక చేశారు. వారితోపాటు దేశంలోని హర్యానా, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, గోవా, గుజరాత్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఉత్తరాఖండ్, బీహార్, కర్నాటక, అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, సిక్కిం, మిజోరామ్, త్రిపుర తదితర రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయులను జాతీయ అవార్డులకు ఎంపిక చేశారు. సెప్టెంబరు 5వ తేదీన న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో అవార్డులను ప్రదానం చేస్తారు. అవార్డు గ్రహీతలకు రూ.50వేల పారితోషికం, ప్రశంసాపత్రంతో పాటు రజత పతకం బహూకరిస్తారు.

వైసీపీకి మరో షాక్

- టీడీపీలో చేరిన ఏలూరు మేయర్ నూర్జహాన్ దంపతులు
- లోకేశ్ సమక్షంలో మరికొందరు ముఖ్య నేతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. కూటమి ప్రభుత్వం భారీ మెజార్టీతో అధికారంలోకి రావడంతో ముఖ్యంగా స్థానిక సంస్థల్లో పెద్దఎత్తున వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. గ్రేటర్ విశాఖపట్నం, మాచర్ల, తాడిపత్రి, కడప తదితర అనేక మున్సిపాలిటీల్లో వైసీపీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ఇటీవల టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. దీనిలో భాగంగానే ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ (చంటి) నేతృత్వంలో ఏలూరు కార్పొరేషన్ మేయర్ షేక్ నూర్జహాన్, ఆమె భర్త ఎస్.ఎమ్.ఆర్ పెదబాబు టీడీపీలో చేరారు. వీరితో పాటు ఈయూడీఏ మాజీ చైర్మన్, ప్రస్తుత వైసీపీ పట్టణ అధ్యక్షులు బి.శ్రీనివాస్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మంచం మైబాబుతో పాటు మరికొందరు వైసీపీ నేతలు విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఉండవల్లి నివాసంలో మంగళవారం ఉదయం వీరందరికీ మంత్రి లోకేశ్ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటమి నుంచి జగన్ గుణపాఠం నేర్చుకోలేదని, ప్రజా ప్రభుత్వంపై నిత్యం దుష్ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. వైసీపీ శ్రేణులే జగన్ వైఖరిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ టీడీపీలో చేరుతున్నారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని లోకేశ్ హామీ ఇచ్చారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటన పట్ల మంత్రి లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. వారికి మెరుగైన చికిత్స అందించాల్సిందిగా విద్య, వైద్య శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజారోగ్య రంగానికి ఉరి

కొత్త వైద్య కళాశాలలకు గ్రహణం: జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ప్రజారోగ్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఉరితాడు బిగుస్తోందని, సామాన్యులకు నాణ్యమైన వైద్యం అందకుండా చేస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇప్పటికే స్పెషలిస్టు వైద్యుల సహా సిబ్బంది నియామకాల్ని నిలిపివేయడంతో జీరో వేకెన్సీ పాలసీకి గండి కొడుతున్నారని, మరోవైపు బిల్లులు చెల్లించకుండా ఆరోగ్యశ్రీని నీరుగారుస్తున్నారని మంగళవారం ఎక్స్ వేదికగా జగన్ ట్వీట్ చేశారు. తద్వారా ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం ఆస్తులు అమ్ముకునే పరిస్థితిని తీసుకువస్తున్నారని మండిపడ్డారు. ఈ ఏడాది కొత్తగా ప్రారంభం కావాల్సిన ఐదు వైద్య కళాశాలలను ఉద్దేశపూర్వకంగా చంద్రబాబు ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్రజారోగ్య రంగాన్ని పటిష్టం చేయడం కోసం అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చామన్నారు. విలేజ్-వార్డు క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్, మండలానికి రెండు పీహెచ్‌సీలు, 108, 104 సర్వీసులు గణనీయంగా పెంపు, ఆరోగ్యశ్రీ పరిధిలోకి 3,257 చికిత్సలు, ఆరోగ్య ఆసరా తదితర

కార్యక్రమాలు ఎప్పుడూ లేని విధంగా చేపట్టామని వివరించారు. ఆస్పత్రుల్లో నాడు-నేడు, కొత్త వైద్య కళాశాలల కోసం రూ.16,880 కోట్లతో పనులు చేపట్టామని, ఇవన్నీ చివరిదశకు వచ్చాయని తెలిపారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి ఒక వైద్య కళాశాల చొప్పున 17 కొత్త వైద్య కళాశాలల నిర్మాణాన్ని రూ.8,480 కోట్ల వ్యయంతో చేపట్టామని గుర్తుచేశారు. 2023-24 విద్యా సంవత్సరంలో విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలల్లో తరగతులు ప్రారంభమయ్యాయని, తద్వారా 750 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయని, పేద విద్యార్థులకు ఎంతో మేలు జరిగిందని వివరించారు. ఈ విద్యా సంవత్సరంలో మరో ఐదు చోట్ల... పాడేరు, మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని కళాశాలల్లో తరగతులు ప్రారంభం కావాల్సి ఉందని, వాటికి అన్ని వసతులూ ఉన్నప్పటికీ చంద్రబాబు వైఖరి కారణంగా వీటికి గ్రహణం పట్టిందని తెలిపారు. కేంద్రంలో బీజేపీతో పొత్తులో ఉన్నప్పటికీ... అనుమతులు తెచ్చుకోలేకపోయారనీ, ఇది మీ వైఫల్యంకాదా అని ప్రశ్నించారు. ఫలితంగా మరో 750 సీట్లు అందుబాటులోకి రాకుండాపోయాయని మండిపడ్డారు. కొత్త వైద్య కళాశాలల్లో వైద్య సీట్లన్నింటినీ కన్వీనర్‌కోటాలో భర్తీచేస్తామంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని గాలికొదిలేశారన్నారు. వైద్య కళాశాలలన్నింటినీ ప్రైవేట్ పరంచేసి, సామాన్యుల నెత్తిన భారం మోపే విధానాల్లోకి వెళ్తున్నారని, ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) మోడల్ అంటూ ప్రైవేట్ కోసం, ప్రైవేట్ వల్ల నడుపుతున్న వ్యవస్థలా ప్రజారోగ్యరంగాన్ని మార్చేసి సామాన్యుడికి నాణ్యమైన వైద్యం అందుబాటులోలేని పరిస్థితిని తీసుకువస్తున్నారన్నారు. చంద్రబాబు మద్దతుపైనే కేంద్ర ప్రభుత్వం ఆధారపడి ఉందని, ఆ పలుకుబడిని వాడుకుని ఆ ఐదు వైద్య కళాశాలలకు వెంటనే అనుమతులు తీసుకురావాలని జగన్ డిమాండ్ చేశారు.

సీఐడీ స్టాండింగ్ కౌన్సిల్ ఝాన్సీలక్ష్మిపై వేటు

విశాలాంధ్ర-గుంటూరు (లీగల్): రాష్ట్రవ్యాప్తంగా సీఐడీ పోలీసులు నమోదు చేసిన కేసులను పర్యవేక్షించే స్టాండింగ్ కౌన్సిల్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సోమసాని ఝాన్సీలక్ష్మిని విధుల నుంచి తొలగిస్తూ సీఐడీ అదనపు డీజీపీ జారీ చేసిన ఉత్తర్వులు మంగళవారం బయటకు వచ్చాయి. 2022 మే నెలలో గత వైసీపీ ప్రభుత్వం గుంటూరుకు చెందిన న్యాయవాది ఝాన్సీలక్ష్మిని మూడేళ్లపాటు ఈ పదవిలో కొనసాగేలాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం ఆమెకు నెలరోజుల గౌరవ వేతనం ముందస్తుగా చెల్లించి... విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అనేక కోర్టులు, న్యాయశాఖకు సంబంధించిన వివిధ విభాగాలలో, హోదాలలో నామినేట్ పద్ధతి ద్వారా విధులు నిర్వహిస్తున్న వారు ఎక్కువ శాతం ఇప్పటికే రాజీనామా చేశారు. కొంతమంది ఆ పదవులను అంటిపెట్టుకొని ఉండటంతో వారిని తొలగిస్తూ... ఆయా శాఖల అధికారులు ఉత్తర్వులు జారీ చేస్తున్నారు.

21 కేజీల గంజాయి స్వాధీనం... ముగ్గురి అరెస్ట్

విశాలాంధ్ర-టంగుటూరు : ఒడిశా నుంచి బెంగళూరుకు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురిని టంగుటూరు పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సింగరాయకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ హజరత్తయ్య వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు అధ్వర్యంలో స్థానిక టోల్ ప్లాజా వద్ద సీఐ హజరత్తయ్య టంగుటూరు ఎస్ఐ నాగమల్లేశ్వరరావు మంగళవారం ఉదయం వాహన తనిఖీలు నిర్వహించారు. అనకాపల్లి జిల్లా రవణపల్లి గ్రామానికి చెందిన గొర్లి గంగు నాయుడు అనే వ్యక్తి గంజాయి అక్రమ రవాణాకు అలవాటు పడ్డాడు. ఒడిశాలోని గుర్తు తెలియని వ్యక్తుల వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి ఆటోల ద్వారా బెంగళూరుకు చెందిన నాగరాజు కునిగల్ రంగప్ప అనే వ్యక్తికి సరఫరా చేస్తూ ఉంటాడు. ఈ క్రమంలో మంగళవారం గంజాయిని తరలిస్తుండగా టంగుటూరు పోలీసులకు పట్టుబడ్డాడు. అతనితో పాటు మైసూరు జిల్లాకు చెందిన మంచినపల్లి రెవిన రవికుమార్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు రూ.లక్షా 5 వేల విలువ గలిగిన 21 కేజీల గంజాయిని, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ వివరించారు. గంజాయి తరలిస్తున్న వారిని అరెస్టు చేయడంలో అత్యంత ప్రతిభ కనబరిచిన సింగరాయకొండ సీఐ సీహెచ్ హజరత్తయ్య, టంగుటూరు ఎస్ఐ నాగమల్లేశ్వరరావులను ప్రకాశం జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

రాజ్యసభకు 12 మంది ఏకగ్రీవం

న్యూఢిల్లీ: రాజ్యసభ ఉపఎన్నికల్లో 12 స్థానాలూ ఏకగ్రీవమయ్యాయి. 9 రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 12 రాజ్యసభ స్థానాల్లో ఉప ఎన్నికల నిర్వహణకు ఇటీవల ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 21 వరకు నామినేషన్లు స్వీకరించగా... తొమ్మిది స్థానాల్లో బీజేపీ, రెండు స్థానాల్లో ఆ పార్టీ మిత్రపక్షాలైన ఎన్సీపీ, ఆర్ఎల్ఎం అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరోవైపు, తెలంగాణ నుంచి కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాజా పరిణా మంతో ఎగువ సభలో ఎన్డీయే మెజార్టీ మార్కును అందుకుంది. తాజా ఎన్నికతో రాజ్యసభలో బీజేపీ బలం 96కి చేరగా... మిత్రపక్షాలతో కలిపి ఎన్డీయే ఆ బలం 112గా ఉంది. దీనికితోడు అధికార పార్టీకి ఆరుగురు నామినేటెడ్, ఒక స్వతంత్ర సభ్యుడి మద్దతు ఉంది. కాంగ్రెస్ నుంచి ఒక సభ్యుడు గెలుపొందడంతో రాజ్యసభలో ప్రతిపక్షాల బలం 85కి పెరిగింది. రాజ్య సభలో ప్రస్తుతం మరో ఎనిమిదిస్థానాలు ఖాళీగా ఉన్నాయి. జమ్మూకశ్మీర్‌లో నాలుగు, మరో నాలుగు నామినేటెడ్ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. దీంతో రాజ్యసభలో ప్రస్తుతం సభ్యుల సంఖ్య 237గా ఉండగా... ఇందుకు మెజార్టీ మార్కు 119గా ఉంది. కొత్త సభ్యులను కలిపి చూస్తే... ఎన్డీయేకు రాజ్యసభలో మెజార్టీ ఉంది.

ఎన్నికైన అభ్యర్థులు...: కిరణ్ చౌదిరి (బీజేపీ- హర్యానా), మమతా మొహంతా (బీజేపీ-ఒడిశా), మిషన్ రంజన్ దాస్ (బీజేపీ-అసోం), రామేశ్వర్ తేలీ (బీజేపీ-అసోం), ధైర్యశీల్ పాటిల్ (బీజేపీ- మహారాష్ట్ర), రవ్‌నీత్ సింగ్ బిట్టూ (బీజేపీ- రాజస్థాన్), ఉపేంద్ర కుశ్వాహా (రాష్ట్రీయ లోక్ మోర్చా-బీహార్), నితిన్ పాటిల్ (ఎన్సీపీ-మహారాష్ట్ర), మనన్ కుమార్ మిశ్రా (బీజేపీ-హార్), జార్జి కురియన్ (బీజేపీ- మధ్య ప్రదేశ్), రాజీబ్ భట్టాచార్య (బీజేపీ-త్రిపుర), అభిషేక్ మను సింఘ్వీ (కాంగ్రెస్- తెలంగాణ).

లైంగిక దాడులకు అడ్డుకట్ట

- బాధితులకు న్యాయం చేసేది ఎప్పుడు?
- పాలకులను నిలదీసిన 35 మహిళా హక్కుల గ్రూపులు

న్యూఢిల్లీ: దేశంలో మహిళలపై రోజురోజుకు పెరిగిపోతున్న లైంగిక వేధింపులు, దాడులపై మహిళా గ్రూపులు తీవ్ర స్థాయిలో నిరసన గళమెత్తాయి. పాలకులు తక్షణమే ఇటువంటి దాడులకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశాయి. అనేక రాష్ట్రాల నుంచి నమోదవుతున్న వరుస అత్యాచార కేసుల మధ్య, మహిళా హక్కుల సంఘాలు త్వరితగతిన విచారణ, చర్యలు తీసుకోవాలని, అలాగే లైంగిక నేరాలు, లింగ ఆధారిత హింసకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. ఆల్ ఇండియా దళిత్ మహిళా అధికార్ మంచ్, ఆల్ ఇండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్, ఆల్ ఇండియా మహిళా సాంస్కృతిక సంఘటన్, ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఉమెన్స్ అసోసియేషన్, ఆల్ ఇండియా ఫెమినిస్ట్ అలయన్స్, ఆల్ ఇండియా లాయర్స్' అసోసియేషన్ ఫర్ జస్టిస్ ఈ డిమాండ్ చేసిన 35 సంస్థలలో ఉన్నాయి. కోల్‌కతా, మణిపూర్, గుజరాత్, ఉత్తరాఖండ్, బీహార్, ఉత్తర ప్రదేశ్‌తో సహా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లైంగిక హింసకు సంబంధించిన దిగ్భ్రాంతికరమైన సంఘటనల నేపథ్యంలో ఈ నిరసన వ్యక్తమయ్యింది. ఆ ఘటనలు ప్రతి ఒక్కటి దేశంలో మహిళల భద్రతకు కొనసాగుతున్న ముప్పునకు భయంకరమైన గుర్తు అని పేర్కొన్నాయి. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో 31 ఏళ్ల జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం ఘటనతో ఈ సంఘాలు తమ నిరసన స్వరాన్ని పెంచాయి. కోల్‌కతాలో జరిగిన దారుణ నేరం క్రూరత్వాన్ని మాత్రమే కాకుండా సంస్థ, అధికారులు తప్పును కప్పి పుచ్చడానికి చేసిన ప్రయత్నాలను తీవ్ర స్థాయిలో ఖండిం చాయి. ఎన్నికలయిన ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల ప్రతిస్పందనను అది తీవ్రంగా విమర్శించింది. న్యాయం జరిగేలా కాకుండా ఈ విషాదాలను రాజకీయం చేస్తున్నారని ఆరోపించింది. నేరాలను అరికట్టడంలో అసమర్థంగా నిరూపించబడిన కేవలం ఖాళీ వాక్చాతుర్యం లేదా మరణశిక్ష వంటి క్రూరమైన చర్యల కంటే నేర పరిశోధన, చట్ట అమలు, పాలనకు సంబంధించి సమర్థవంతమైన పనితీరుపై దృష్టి కేంద్రీకరించాలని ఈ మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. కోల్‌కతా కేసులో మమతా బెనర్జీ నేతృత్వంలోని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఆ ప్రకటన ప్రత్యేకంగా విమర్శించింది. ఈ నేరాన్ని ఆత్మహత్యగా 'తొలగించడానికి' రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రారంభ ప్రయత్నాలను, దేశవ్యాప్తంగా నిరసనల మధ్య కీలకమైన ఆసుపత్రి అధికారులను బదిలీ చేయడాన్ని ప్రకటన ఖండించింది. 43 మంది డాక్టర్లు, ప్రొఫెసర్ల వివాదాస్పద బదిలీలతో సహా ప్రభుత్వ చర్యలు న్యాయం కోసం డిమాండ్ చేస్తున్న వారి నోరు మూయించే ప్రయత్నాలుగా కనిపిస్తున్నాయని తెలిపింది. ప్రస్తుతం కోల్‌కతా కేసును దర్యాప్తు చేస్తున్న కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ని రాజకీయ ప్రభావం లేకుండా న్యాయమైన, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని మహిళా గ్రూపులు కోరాయి. బిల్కిస్ బానో కేసు, కతువా కేసు, మణిపూర్‌లో హింసాకాండ వంటి వాటిలో క్రూరమైన నేరాలకు పాల్పడిన వ్యక్తులను ప్రభుత్వం విడుదల చేసి గౌరవించిందని ఆరోపించిన వాతావరణంలో న్యాయం పొందడంలో ఉన్న సవాళ్లను కూడా ఈ ప్రకటన ప్రత్యేకంగా ఎత్తిచూపింది. మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఫల్యం గురించి ప్రకటన దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ చట్టాలను పర్యవేక్షించడానికి యంత్రాంగాలు ఉన్నప్పటికీ అవి తరచుగా విస్మరించబడుతున్నాయని మహిళా గ్రూపులు వాదించాయి. పితృస్వామ్యం, కులం, తరగతి, ఇతర అణచివేత వ్యవస్థలలో పాతుకుపోయిన నిర్మాణాత్మక హింసను ఎత్తిచూపుతూ, స్త్రీలను, ముఖ్యంగా అట్టడుగు వర్గాలకు చెందిన వారిని అసమానంగా ప్రభావితం చేసే ఈ సమస్య వ్యక్తిగత కేసులకు మించిందని గ్రూపుల కార్యకర్తలు నొక్కి చెప్పారు. వారు జాతీయ నేర నమోదు సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) వివరాలను ఉదహరించారు ఇది దేశంలో రోజుకు సగటున 86 అత్యాచారాలను నివేదించింది. జాతీయ నేరారోపణ రేటు 27 శాతం తక్కువగా ఉంది. కీలకమైన రక్షణ చట్టాల అమలును పర్యవేక్షించడానికి నిధుల కొరతను ప్రశ్నిస్తూ ఇటీవలి బడ్జెట్ కేటాయింపులను కూడా ఈ ప్రకటన విమర్శించింది. తప్పనిసరి యంత్రాంగాలు అమలులో ఉన్నాయా, పని చేస్తున్నాయో లేదో వెల్లడించడానికి మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ నిరాకరించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి మరింత నిదర్శనమని ప్రకటన పేర్కొంది. తమ పిలుపులో బాధితులకు న్యాయం చేయడమే కాకుండా వ్యవస్థాగత మార్పును కూడా సంఘాలు కోరుతున్నాయి. న్యాయమైన విచారణ ప్రక్రియకు పిలుపునిచ్చారు. సంస్థలు, ఎన్నికయిన ప్రతినిధులు, చట్టాన్ని అమలు చేసే సంస్థల వైఫల్యాలకు జవాబుదారీతనం ఉండేలా సుప్రీం కోర్టును కోరారు. లైంగిక హింస చుట్టూ ఉన్న నిశ్శబ్దాన్ని విచ్ఛిన్నం చేయడం, పితృస్వామ్య నిర్మాణాలను సవాలు చేయడం, న్యాయం, జవాబుదారీతనం కోసం నిలబడాలని ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మార్పునకు సమయం ఆసన్నమైందని వారు నొక్కి చెప్పారు.

సీజనల్ వ్యాధులు, విషజ్వరాలపై నిపుణుల కమిటీ: సత్యకుమార్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా పటిష్ట నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలను సూచించడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. వెలగపూడి సచివాలయం ఐదో బ్లాక్ సమావేశ మందిర్‌లో మంగళవారం సీజనల్ వ్యాధులపై మంత్రి సమీక్షించారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ సి.హరికిరణ్ ఛైర్మన్‌గా వ్యవహరించే కమిటీలో పంచాయతీరాజ్ కమిషనర్, మునిసిపల్‌శాఖ కమిషనర్, ఐటీడీఏ పాడేరు పీఓ, మైక్రోబయాలజిస్ట్, గ్యాస్ట్రోఎంటిరాలజిస్ట్, సోషల్ ప్రివెంటివ్ మెడిసిన్ నిపుణుడు, మరో ఇద్దరు వైద్య నిపుణులు సభ్యులుగా ఉంటారన్నారు. ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారన్నారు. డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియాతో రాష్ట్రంలో ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకూడదన్నారు. కలెక్టర్లు వారానికోసారి జ్వరాలు, సీజనల్ వ్యాధులపై సమీక్షించాలన్నారు. మునిసిపల్, పంచాయతీరాజ్ అధికారులతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై సమర్థవంతమైన పర్యవేక్షణా వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. కిందిస్థాయి సిబ్బంది కేసుల్ని గుర్తించిన వెంటనే పరీక్ష చేసి ల్యాబ్‌లకు పంపించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు, సెక్రటరీ డాక్టర్ మంజుల, కమిషనర్ సి.హరికిరణ్, డాక్టర్ పద్మావతి, డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ బి.సుబ్రహ్మణ్యేశ్వరి పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.